


# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | బుధవారం 29-07-2026 | సంపుటి - 31 | సంచిక - 65 | రూ : 4 | పేజీలు: 8


# మా ప్రభుత్వం తెచ్చిన గొప్ప సంస్కరణ.. హైడ్రా

## దానికి మరింత సాధికారత కల్పిస్తాం



- దొంగలు, కబ్జాకోరులు, భారాసవాళ్లే రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నారు
- బతుకమ్మ కుంటను కబ్జాచేసి కోర్టు ధిక్కరణ పిటిషన్ వేసింది కేసీఆర్‌పై విమానం నుంచి పూలవర్షం కురిపించిన వ్యక్తే
- ఓ అధికారిని ఎక్కడ నియమించాలన్నది ప్రభుత్వానికున్న విచక్షణాధికారం.. దాన్ని ఎవరూ గుంజుకోలేరు
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



దిల్లీ: తెలంగాణలో తమ ప్రభుత్వం తెచ్చిన గొప్ప సంస్కరణ హైడ్రా అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. దానికి మరింత సాధికారత కల్పిస్తామని వెల్లడించారు. చెరువులు, నాలాలు, కుంటలు, పార్కులు, ప్రభుత్వ భూములు కొట్టేయడానికి ప్రయత్నిస్తున్న కబ్జాకోరులు తప్పుడు డాక్యుమెంట్లతో కోర్టులను తప్పుదోవపట్టించి ఆ సంస్థను అడ్డుకొనే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ఆయన మంగళవారం సాయంత్రం తరువాయి 2లో



రీ సర్వేతో..

# భూవివాదాలు లేని తెలంగాణ

- గ్రామసభలతో ప్రజలకు అవగాహన కల్పించాలి
- సమీక్షలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

హైదరాబాద్: భూముల రీ సర్వేతో భూవివాదాలు లేని తెలంగాణ సాధ్యమవుతుందని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్లు అత్యంత ప్రాధాన్యంగా అమలు చేయాలని, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలో.. రీ సర్వే జరుగుతున్న గ్రామాల్లో పురోగతి, ప్రజల స్పందన, ఎదురవుతున్న సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై రెవెన్యూ, సర్వే అధికారులతో మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "తొలి దశలో జిల్లాకు

తరువాయి 2లో



# కృత్రిమ సూర్యుడి దిశగా చైనా

## ప్రపంచంలోనే అతిపెద్ద మాగ్నెట్ పరీక్ష విజయవంతం

- కృత్రిమ సూర్యుడి దిశగా చైనా ముందడుగు
- ప్రపంచంలోనే అతిపెద్ద ఫ్యూజన్ మాగ్నెట్‌ను విజయవంతంగా పరీక్షించిన శాస్త్రవేత్తలు
- 10 కోట్ల డిగ్రీల ఉష్ణోగ్రతను నియంత్రించేందుకు ఇది కీలకం
- అణు సంలీనం ద్వారా పరిశుభ్రమైన ఇంధనాన్ని ఉత్పత్తి చేయడమే లక్ష్యం

2లో

# ఏపీ మంత్రి నారా లోకేశ్‌ను కలిసిన బీబీసీ బృందం



- భారత్‌లో మహిళల క్రీడలపై రూపొందించిన సర్వే వెల్లడి
- తెలుగు రాష్ట్రాల్లో బ్యాడ్మింటన్ ఆడే మహిళలు మూడింతలు పెరిగారని గుర్తింపు
- 2020లో 3 శాతం ఉన్న సంఖ్య ఇప్పుడు 9 శాతానికి చేరినట్లు సర్వేలో వెల్లడి
- మహిళా క్రీడాకారులకు అన్ని విధాలా అండగా ఉంటామని లోకేశ్ హామీ

2లో



# జపాన్‌ను వణికించిన భారీ భూకంపం.. సునామీ హెచ్చరిక జారీ

- జపాన్‌లోని కుమమోటోలో 7.1 తీవ్రతతో భారీ భూకంపం
- క్యుషు ద్వీపంలోని కుమమోటో సమీపంలో భూకంప కేంద్రం
- తీర ప్రాంతాలకు సునామీ హెచ్చరిక

2లో

# విద్యార్థుల భవిష్యత్తుపై పార్లమెంట్‌లో చర్చ జరగాలి

- పరీక్షల బిల్లుపై చర్చకు ప్రతిపక్షం సిద్ధమన్న థరూర్
- విద్యార్థుల గొంతు సభలో వినిపించాలని వ్యాఖ్య
- బిల్లుపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తామన్న కాంగ్రెస్
- ఒక్క రాజీనామా సరిపోదన్న థరూర్
- ప్రధాన్‌కు పార్లమెంటులో స్వాగతంపై అభ్యంతరం






# ఫేస్‌బుక్‌లో మోదీ వీడియో తొలగింపు.. క్షమాపణ చెప్పిన మెటా

- సాంకేతిక లోపమే కారణమన్న సంస్థ
- వెంటనే వీడియో పునరుద్ధరణ
- ఘటనను సీరియస్‌గా పరిగణిస్తున్న కేంద్రం
- మెటా అధికారులకు సమన్లు ఇచ్చినట్లు సమాచారం



# మా ప్రభుత్వం తెచ్చిన గొప్ప సంస్కరణ.. హైడ్రా

ఢిల్లీ: తెలంగాణలో తమ ప్రభుత్వం తెచ్చిన గొప్ప సంస్కరణ హైడ్రా అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. దానికి మరింత సాధికారత కల్పిస్తామని వెల్లడించారు. చెరువులు, నాలాలు, కుంటలు, పార్కులు, ప్రభుత్వ భూములు కొట్టేయడానికి ప్రయత్నిస్తున్న కబ్జాకోరులు తప్పుడు డాక్యుమెంట్లతో కోర్టులను తప్పుదోవపట్టించి ఆ సంస్థను అడ్డుకొనే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ఆయన మంగళవారం సాయంత్రం ఇక్కడ పీఎం ఆవాస్ యోజన ఇళ్లు, కరవు పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్రానికి కేంద్ర బృందాన్ని పంపాలన్న అంశంపై కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి శివరాజ్‌సింగ్‌చౌహాన్‌ను కలిసి చర్చించిన తర్వాత విలేకర్లతో మాట్లాడారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను మార్చాలని హైకోర్టు జారీచేసిన ఆదేశాల గురించి విలేకర్లు అడగ్గా... ''హైకోర్టు ఆదేశాలను నేను ఇంకా పరిశీలించలేదు. ప్రభుత్వపరంగా సమీక్షిస్తాం. కోర్టు ఆదేశాలను గౌరవిస్తాం. హైడ్రా ప్రధాన విధి ప్రభుత్వ పార్కులు, చెరువులు, కుంటలు, నాలాలను కాపాడటమే. ఆ పని కచ్చితంగా చేస్తోంది. ఎవరు ఎన్ని అడ్డంకులు సృష్టించినా దాని పనులను భవిష్యత్తులో కూడా కొనసాగిస్తాం. దానికి మరింత సాధికారత కల్పిస్తాం. అది స్వాధీనం చేసుకున్న చెరువులు, కుంటలను ఇతరులెవ్వరికీ ఇవ్వలేదు. దాని కార్యాచరణ, బాధ్యతలపట్ల ప్రభుత్వానికి స్పష్టమైన అవగాహన ఉంది. దానిని రద్దు చేయాలని దొంగలు, కబ్జాకోరులు, భారాసవాళ్లు మాత్రమే డిమాండ్ చేస్తున్నారు. కోర్టు ధిక్కరణ కేసుల్లో అధికారులను మార్చాలన్న నిబంధన ఉందంటున్నారు... గతంలో సోమేశ్‌కుమార్ మీద 400 కోర్టు ధిక్కరణ కేసులున్నా ఎవరూ ఆ విషయం గురించి మాట్లాడలేదు. ఒక అధికారిని ఎక్కడ నియమించాలన్నది ప్రభుత్వ విచక్షణాధికారం కిందికి వస్తుంది. ఆ అధికారాన్ని ఎవరూ గుంజుకోలేరు. మాకు న్యాయస్థానాల మీద సంపూర్ణమైన విశ్వాసం ఉంది. ఈ అంశాలపై న్యాయ స్థానాల్లోనే పోరాడతాం. హైడ్రా అత్యుత్తమ వ్యవస్థ కాబట్టే జాతీయ స్థాయిలో అన్ని ప్రాంతాల నుంచి మాకు అభినందనలు అందాయి'' అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరించారు.

*** విద్యను రాష్ట్రాల పరిధిలో ఉంచితేనే తప్పలకు తక్కువ ఆస్కారం**

''విద్యారంగానికి సంబంధించి రాష్ట్రాలకున్న అధికారాలను కేంద్రం గుంజుకొనే ప్రయత్నం చేస్తోంది. దీనివల్లే పేపర్ లీక్‌లాంటి గందరగోళ పరిస్థితులు ఏర్పడుతున్నాయి. విద్యను వీలైనంతవరకు రాష్ట్రాల పరిధిలో ఉంచాలి. అప్పుడు తప్పిదాలు తక్కువ జరగడానికి ఆస్కారం ఉంటుంది. కేంద్ర ప్రభుత్వం భేషజాలకు పోకుండా రాష్ట్రాలపై పెత్తనం చేసే విధానాలను మానుకోవాలి. విద్యార్థులకు మేలు జరగాలని మా ప్రభుత్వం, పార్టీ కోరుకుంటోంది. కేంద్ర ప్రభుత్వం తీసుకురాబోయే చట్టాన్ని దృష్టిలో పెట్టుకొని మేం ఏం ప్రక్షాళన చేయాలో పరిశీలిస్తాం. తగిన మేరకు మేం రాష్ట్రంలోనూ చట్టాలను రూపొందిస్తాం.

*** కోచింగ్ సెంటర్లపై జాతీయ విధానం ఉండాలి**

దేశవ్యాప్తంగా కోచింగ్ సెంటర్లు అనుమతులు లేకుండా పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. పరీక్ష ప్రశ్నాపత్రాలు లీక్ అవడానికి అవి కూడా వేదికలుగా మారుతున్నాయి. అందువల్ల వాటి అనుమతులపై జాతీయ స్థాయిలో ఒక విధానాన్ని రూపొందించాల్సిన అవసరం ఉంది. అలాగే ఆన్‌లైన్ పరీక్షల్లో పెద్దగా సమస్యల్లేవు. ఆఫ్‌లైన్ పరీక్షలవల్లే ఎక్కువ ఇబ్బందులు వస్తున్నాయి. అందువల్ల ఈ అంశాన్ని కూడా దృష్టిలో పెట్టుకోవాలి'' అని ముఖ్యమంత్రి సూచించారు.

**ఇక ఏ సంవత్సరం ఫీజు ఆ సంవత్సరమే..**

''ఇక నుంచి విద్యార్థులకు ఏ సంవత్సరం ఫీజు ఆ సంవత్సరమే పూర్తిగా చెల్లిస్తాం. ఇందుకోసం ఏటా రూ.2,400 కోట్ల దాకా ఖర్చవుతుందని మేం లెక్కలు వేశాం. భవిష్యత్తులో ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్య ఉండదు. ఆ బాధ్యత మాదే. గతంలో ఎలాంటి వసతులూ కల్పించకుండా దొంగలెక్కలు చూపించి ఫీజు రీయింబర్స్‌మెంట్ మొత్తాన్ని కొట్టేయాలనుకున్న సంస్థలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణ చేయిస్తున్నాం. కరెక్ట్‌గా ఉన్న సంస్థలకు ఫీజులు చెల్లిస్తాం. కేసీఆర్ ప్రభుత్వం రూ.8 వేల కోట్ల ఫీజు బకాయిలుపెట్టి పోయింది. అవే ఇప్పుడు భారంగా మారాయి. ఈరోజు మేం ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వడంలేదన్నట్లుగా భారాస భ్రమలు కల్పించే ప్రయత్నం చేస్తుంటే భాజపా వంతపాడుతోంది. ఆ పార్టీ నాయకులు రామచందర్‌రావు, ఆర్.కృష్ణయ్యలు తెలంగాణలో పదేపదే ఫీజు రీయింబర్స్‌మెంట్ గురించి మాట్లాడుతున్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి రాజ్యసభకు ఎన్నికైన ఆర్.కృష్ణయ్య ఆ రాష్ట్రంలో రూ.10 వేల కోట్లమేర ఉన్న బకాయిల గురించి ఎందుకు మాట్లాడటంలేదో చెప్పాలి. ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్డీయే ప్రభుత్వం 100% చెల్లించిన తర్వాత భాజపా నాయకులు కిషన్‌రెడ్డి, రామచందర్‌రావు, ఆర్.కృష్ణయ్యలు తెలంగాణలో డిమాండ్ చేస్తే బాగుంటుంది. వారు ఆ పని చేయకుండా దిగజారి వ్యవహరిస్తున్నారు'' అని సీఎం రేవంత్‌రెడ్డి ధ్వజమెత్తారు.

# రీ సర్వేతో భూవివాదాలు లేని తెలంగాణ



హైదరాబాద్: భూముల రీ సర్వేతో భూవివాదాలు లేని తెలంగాణ సాధ్యమవుతుందని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్లు అత్యంత ప్రాధాన్యంగా అమలు చేయాలని, నిర్ణీత గడువులోగా పూర్తిచేయాలని ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలో.. రీ సర్వే జరుగుతున్న గ్రామాల్లో పురోగతి, ప్రజల స్పందన, ఎదురవుతున్న సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై రెవెన్యూ, సర్వే అధికారులతో మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ''తొలి దశలో జిల్లాకు 70 చొప్పున ఎంపిక చేసిన 2,240 గ్రామాల్లో రీ సర్వే జరుగుతోంది. దీనిపై ప్రజల్లో పూర్తి అవగాహన కల్పించేందుకు గ్రామసభలు నిర్వహించాలి. సర్వేతో కలిగే ప్రయోజనాలను రైతులకు, భూ యజమానులకు వివరించాలి. ప్రజల సహకారంతోనే ఈ కార్యక్రమం విజయవంతం అవుతుంది. సర్వే జరుగుతున్న ప్రతి గ్రామంలో అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలి. ప్రజల సందేహాలను నివృత్తి చేయాలి. జిల్లా స్థాయిలో కలెక్టర్లు స్వయంగా పర్యవేక్షించి వారానికోసారి పురోగతిని సమీక్షించాలి. రెవెన్యూ, సర్వే శాఖ అధికారులు పూర్తి సమన్వయంతో పనిచేసి నిర్ణీత లక్ష్యాలను సాధించాలి. దశాబ్దాలుగా కొనసాగుతున్న భూవివాదాలకు శాశ్వత పరిష్కారం చూపేందుకే ప్రభుత్వం అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రీ సర్వే చేపట్టింది. దీంతో ప్రతి కమతానికి కచ్చితమైన హద్దులు గుర్తిస్తారు. అనంతరం ప్రత్యేక భూదార్ నంబరు కేటాయించి భూభారతి పోర్టల్‌లో నమోదు చేస్తారు. యాజమాన్యంలో స్పష్టత రావడం వల్ల రిజిస్ట్రేషన్లు, మ్యుటేషన్లు మరింత పారదర్శకంగా జరుగుతాయి'' అని వివరించారు. సమావేశంలో రెవెన్యూశాఖ కార్యదర్శి లోకేష్ కుమార్, రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీ రాజీవ్‌గాంధీ హనుమంతు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఏపీ మంత్రి నారా లోకేశ్‌ను కలిసిన బీబీసీ బృందం

తెలుగు రాష్ట్రాల్లో బ్యాడ్మింటన్ ఆడే మహిళల సంఖ్య గణనీయంగా పెరిగినట్లు ఓ సర్వేలో వెల్లడైంది. బీబీసీ న్యూస్ తెలుగు అసిస్టెంట్ ఎడిటర్ అనిల్ కుమార్, కలెక్టివ్ న్యూస్‌రూమ్ బృందం ఏపీ మంత్రి నారా లోకేశ్‌తో తాజాగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు భారత్‌లో మహిళల క్రీడలపై నిర్వహించిన సర్వే వివరాలను లోకేశ్‌కు అందించారు. ఈ సర్వేలోని పలు అంశాలు ఆసక్తిని రేకెత్తించాయి. ముఖ్యంగా, తెలుగు రాష్ట్రాల్లో 2020 నుంచి ఇప్పటివరకు బ్యాడ్మింటన్ ఆడే మహిళల సంఖ్య మూడింతలు పెరిగిందని సర్వేలో తేలింది. 2020లో కేవలం 3 శాతంగా ఉన్న ఈ సంఖ్య, ఇప్పుడు 9 శాతానికి చేరినట్లు బీబీసీ బృందం వివరించింది. ఈ సర్వే ఫలితాలపై మంత్రి నారా లోకేశ్ హర్షం వ్యక్తం చేశారు. ఏపీలో క్రీడాకారులకు, ముఖ్యంగా యువతులకు మరిన్ని అవకాశాలు, మెరుగైన మౌలిక వసతులు, బలమైన మద్దతు వ్యవస్థలను సృష్టించేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు. క్రీడల్లో రాణించాలనే కల ఉన్న ప్రతి అమ్మాయికి అవకాశం కల్పించడమే తమ లక్ష్యమని లోకేశ్ తెలిపారు.

# జపాన్‌ను వణికించిన భారీ భూకంపం.. సునామీ హెచ్చరిక జారీ

జపాన్‌లోని దక్షిణ ప్రాంతాన్ని మంగళవారం మధ్యాహ్నం భారీ భూకంపం వణికించింది. క్యుషు ద్వీపంలోని కుమమోటో ప్రిఫెక్చర్‌లో రిక్టర్ స్కేలుపై 7.1 తీవ్రతతో ఈ భూకంపం సంభవించింది. దీంతో జపాన్ వాతావరణ సంస్థ వెంటనే తీర ప్రాంతాలకు సునామీ హెచ్చరికలు జారీ చేసింది. స్థానిక కాలమానం ప్రకారం మధ్యాహ్నం ఈ భూకంపం సంభవించినట్లు అధికారులు వెల్లడించారు. కుమమోటో నగర సమీప ప్రాంతం కేంద్రంగా, భూమికి 10 కిలోమీటర్ల లోతులో ప్రకంపనలు నమోదయ్యాయి. అరియాకే, యత్సుషిరో సముద్ర తీరాల్లో సుమారు ఒక మీటర్ ఎత్తున అలలు ఎగిసిపడే ముప్పు ఉందని, ప్రజలందరూ తీరానికి దూరంగా సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని అధికారులు హెచ్చరించారు. భూకంపం కారణంగా కుమమోటో ప్రాంతంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. భద్రతా కారణాల దృష్ట్యా బుల్లెట్ రైళ్లతో సహా అన్ని రైలు సర్వీసులను తాత్కాలికంగా రద్దు చేశారు. క్యుషు ద్వీపంలోని కుమమోటో, నాగసాకి, కగోషిమా, ఫుకుయోకా, సాగా, ఒయిటా, మియాజాకి ప్రాంతాల్లో జపాన్ ప్రభుత్వం తదుపరి అత్యవసర భూకంప హెచ్చరికలను జారీ చేసింది. జపాన్‌లో ప్రతి ఏటా వందలాది భూకంపాలు సంభవిస్తుంటాయి. ప్రపంచవ్యాప్తంగా సంభవించే భూకంపాలలో దాదాపు 18 శాతం జపాన్‌లోనే నమోదవుతుంటాయి. వీటిలో అత్యధిక శాతం స్వల్ప తీవ్రత కలిగినవే అయినప్పటికీ, కొన్నిసార్లు తీవ్ర నష్టం వాటిల్లుతుంది. 2011లో రిక్టర్ స్కేలుపై 9.0 తీవ్రతతో సంభవించిన వినాశకర భూకంప వల్ల సుమారు 18,500 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ఏడాది ఏప్రిల్ 20న జపాన్

# ఫేస్‌బుక్‌లో మోదీ వీడియో తొలగింపు.. క్షమాపణ చెప్పిన మెటా

ప్రధాని నరేంద్ర మోదీకి సంబంధించిన వీడియోను ఫేస్‌బుక్‌లో కొద్దిసేపు నిలిపివేసిన ఘటనపై కేంద్ర ప్రభుత్వానికి మెటా క్షమాపణ చెప్పింది. ఇది ఉద్దేశపూర్వకంగా జరగలేదని, సాంకేతిక లోపం వల్లేనని వివరణ ఇచ్చింది. పొరపాటు గుర్తించిన వెంటనే వీడియోను పునరుద్ధరించినట్లు మెటా ప్రతినిధి వెల్లడించారు. జులై 23న అప్‌లోడ్ చేసిన ఈ వీడియోలో విద్యార్థుల నిరసనల సందర్భంగా జనరేషన్ జెడ్‌ను ఉద్దేశించి మోదీ సందేశం ఇచ్చారు. పరీక్షల ప్రశ్నపత్రాల లీక్‌లను అరికట్టేందుకు కఠిన చర్యలు ప్రకటిస్తామని అందులో పేర్కొన్నారు. అయితే కొద్దిసేపు ఈ వీడియోను తెరవడానికి ప్రయత్నించిన వినియోగదారులకు 'చట్టపరమైన అభ్యర్థన మేరకు ఈ ప్రాంతంలో వీడియోను నిలిపివేశాం' అనే సందేశం కనిపించింది. అనంతరం వీడియోను తిరిగి అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ ఘటనను కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తున్నట్లు సమాచారం. మెటా ఇచ్చిన వివరణతో పాటు వీడియో తొలగింపునకు దారితీసిన పరిస్థితులను పరిశీలిస్తోంది. ఈ అంశంపై వివరణ ఇవ్వాలని మెటా ప్రతినిధులు, సంబంధిత అధికారులను కేంద్రం పిలిచే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. మరోవైపు కేంద్ర సమాచార సాంకేతిక శాఖ ఇప్పటికే మెటా, ఇన్‌స్టాగ్రామ్ ఉన్నతాధికారులకు సమన్లు జారీ చేసినట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

# కృత్రిమ సూర్యుడి దిశగా చైనా

అపరిమితమైన, స్వచ్ఛమైన ఇంధనాన్ని సృష్టించే లక్ష్యంతో చేపట్టిన 'కృత్రిమ సూర్యుడు' ప్రాజెక్టులో చైనా మరో కీలక మైలురాయిని అధిగమించింది. అణు సంలీన రియాక్టర్ కోసం రూపొందించిన ప్రపంచంలోనే అతిపెద్ద సూపర్ కండక్టింగ్ మాగ్నెట్‌ను చైనా శాస్త్రవేత్తలు విజయవంతంగా పరీక్షించారు. భవిష్యత్తులో ఫ్యూజన్ ఎనర్జీని సాధించే దిశగా ఇది అత్యంత కీలకమైన ఇంజినీరింగ్ విజయమని నిపుణులు అభివర్ణిస్తున్నారు. చైనీస్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ పరిధిలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాస్మా ఫిజిక్స్ (ఏఎస్ఐపీపీ) శాస్త్రవేత్తలు ఈ ఘనత సాధించారు. స్వదేశీ సాంకేతికతతో అభివృద్ధి చేసిన టోరాయిడల్ ఫీల్డ్ మాగ్నెట్, హైటెంపరేచర్ సూపర్ కండక్టింగ్ సెంట్రల్ సోలనోయిడ్ కాయిల్ వ్యవస్థలు అన్ని పరీక్షల్లోనూ ఉత్తీర్ణత సాధించినట్లు వారు ప్రకటించారు. సుమారు 582 టన్నుల బరువున్న ఈ భారీ మాగ్నెట్‌ను 'డీ' ఆకారంలో నిర్మించారు. దీని తయారీకి అవసరమైన కీలక పదార్థాల నుంచి సాంకేతిక పరిజ్ఞానం వరకు అన్నింటినీ చైనా దేశీయంగానే సమకూర్చుకోవడం విశేషం. అణు సంలీన ప్రక్రియలో భాగంగా, సూర్యుడి కేంద్ర భాగం కంటే కొన్ని రెట్లు అధిక ఉష్ణోగ్రత కలిగిన ప్లాస్మాను సృష్టిస్తారు. ఈ అత్యధిక ఉష్ణోగ్రత రియాక్టర్ గోడలను తాకకుండా, శక్తిమంతమైన అయస్కాంత క్షేత్రంలో బంధించేందుకు ఈ భారీ మాగ్నెట్‌లు కీలక పాత్ర పోషిస్తాయి. హైడ్రోజన్ ఐసోటోప్‌లను సంలీనం చేయడం ద్వారా శక్తిని ఉత్పత్తి చేసే ఈ విధానం, భవిష్యత్తులో కర్బన రహిత విద్యుత్ ఉత్పత్తికి మార్గం సుగమం చేస్తుంది. ఈ ప్రయోగం విజయవంతమైనప్పటికీ, వాణిజ్య స్థాయిలో ఫ్యూజన్ విద్యుత్‌ను నిరంతరాయంగా ఉత్పత్తి చేయడం అంతర్జాతీయ శాస్త్రవేత్తలకు ఇప్పటికీ సవాలుగానే ఉంది. అయితే, తన ఇంధన మరియు సాంకేతిక లక్ష్యాల సాధనలో భాగంగా చైనా ఈ రంగంలో భారీగా పెట్టుబడులు పెడుతూ వేగంగా ముందుకు సాగుతోందని ఈ తాజా పరిణామం స్పష్టం చేస్తోంది.



# హౌస్ ఆఫ్ లార్డ్స్‌కు ఎన్నికైన ఉదయ్‌నాగరాజుకు భారాస, భాజపా నేతల సన్మానం

దిల్లీ: బ్రిటన్ హౌస్ ఆఫ్ లార్డ్స్‌కు ఎన్నికైన తెలంగాణకు చెందిన ప్రవాస భారతీయుడు ఉదయ్‌నాగరాజును మంగళవారం దిల్లీలో భారాస, భాజపా నాయకులు వేర్వేరుగా సన్మానించారు. ఇందులో భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, ఆ పార్టీ ఎంపీలు వద్దిరాజు రవిచంద్ర, దామోదార్‌రావు, మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి పాల్గొన్నారు. భాజపా నుంచి ఎంపీలు కె.లక్ష్మణ్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, పార్టీ అధికార ప్రతినిధి ఎన్‌వీ సుభాష్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హౌస్ ఆఫ్ లార్డ్స్ సభ్యుడిగా ఎన్నిక కావడం ఉదయ్‌నాగరాజు పట్టుదల, కృషి నిదర్శనమని ప్రశంసించారు. ఆయన ప్రస్థానం యువతకు, ముఖ్యంగా ప్రవాస భారతీయులకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఇరుదేశాల ద్వైపాక్షిక సంబంధాల బలోపేతానికి కృషిచేయాలన్నారు.




# విద్యార్థుల భవిష్యత్తుపై పార్లమెంట్‌లో చర్చ జరగాలి

లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ఈ బిల్లుపై మధ్యాహ్నం 2 గంటలకు చర్చ చేపడతామని ప్రకటించిన తర్వాత థరూర్ మీడియాతో మాట్లాడారు. విద్యార్థుల గొంతు పార్లమెంట్‌లో వినిపించాల్సిన బాధ్యత ప్రతిపక్షంపై ఉందన్నారు. ఈ బిల్లు పరీక్షల ప్రశ్నపత్రాల లీకేజీ సమస్యకు నిజంగా పరిష్కారం చూపుతుందా లేదా అనే అంశాన్ని ప్రతిపక్షం నిశితంగా పరిశీలిస్తుందని చెప్పారు. ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేయడం, కొన్ని నిబంధనలు మార్చడం మాత్రమే సరిపోతుందా? విద్యార్థుల భవిష్యత్తును నిజంగా కాపాడగలదా? అనే ప్రశ్నలకు ప్రభుత్వం సమాధానం చెప్పాల్సి ఉందని థరూర్ అన్నారు. ఒక్క మంత్రి రాజీనామాతో సమస్య పరిష్కారం కాదని, మొత్తం పరీక్షల వ్యవస్థలో సమగ్ర సంస్కరణలు అవసరమని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ జవాబుదారీతనమే ముఖ్యమని పేర్కొన్నారు. మాజీ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా అనంతరం పార్లమెంట్‌కు వచ్చినప్పుడు ఆయనకు స్వాగతం పలకడంపై కూడా థరూర్ స్పందించారు. నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేసిన మంత్రిని హీరోలా స్వాగతించడం ఆందోళన కలిగించే విషయమన్నారు. పరీక్షల వ్యవస్థ వైఫల్యంతో నష్టపోయిన విద్యార్థులు, వారి కుటుంబాల మనోభావాలను అలా వ్యవహరించిన వారు అర్థం చేసుకోలేదని విమర్శించారు.

# ఎస్ఐఆర్ పేరుతో ఓట్ల తొలగింపు కుట్రలను అడ్డుకోవాలి

**: బూరుగు కృష్ణారెడ్డి**




చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: ఎస్ఐఆర్ పేరుతో ఓట్ల తొలగింపు కుట్రలను అడ్డుకొని.. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బూరుగు కృష్ణారెడ్డి అన్నారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం కందాల రంగారెడ్డి స్మారక భవనంలో సిపిఎం మండల కమిటీ సమావేశం పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు రాగీరు కిష్టయ్య అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బూరుగు కృష్ణారెడ్డి హాజరై, మాట్లాడారు. గత పన్నెండు సంవత్సరాలుగా దేశాన్ని పాలిస్తున్న బీజేపీ-మోదీ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ తుంగలో తొక్కిందని ఆరోపించారు. హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత విలువైనదని పేర్కొంటూ, ఓటర్ల జాబితాల సవరణ ప్రక్రియ పారదర్శకంగా, చట్టబద్ధంగా జరగాలన్నారు. ఎస్ఐఆర్ పేరుతో ఓటర్ల జాబితాల్లో మార్పులు చేయడంపై ప్రజల్లో వ్యక్తమవుతున్న ఆందోళనలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలని, ప్రతి అర్హుడైన ఓటరికి తన ఓటు హక్కు రక్షించబడేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శి గంగాదేవి సైదులు, మండల కార్యదర్శి వర్గ సభ్యులు చీరిక సంజీవరెడ్డి, చింతల సుదర్శన్, మండల కమిటీ సభ్యులు అంతటి అశోక్, పొట్ట శ్రీనివాస్, పల్లె మధు కృష్ణ, జక్కిడి దేవేందర్ రెడ్డి, కొంతం సుశీల, చెరుకు లక్ష్మమ్మ, కొండే శ్రీశైలం, ఎలమల్ల సంజీవ, తదితరులు పాల్గొన్నారు.

## బహుజన ప్రజావేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నందిపాటి ప్రభాకర్ ఎన్నిక



గరిడేపల్లి, ప్రజాస్ఫూర్తి: తెలంగాణ రాష్ట్ర బహుజన ప్రజావేదిక అనుబంధ సంఘాల ఎన్నికలు ఆదివారం నల్లగొండ జిల్లా కార్యాలయంలో నిర్వహించగా, గరిడేపల్లి మండలం పొనుగోడు గ్రామానికి చెందిన నందిపాటి ప్రభాకర్‌ను బహుజన ప్రజా ట్రేడ్ యూనియన్ (బిజెటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు మహమ్మద్ రఫీ నందిపాటి ప్రభాకర్‌కు నియామక పత్రాన్ని అందజేసి అభినందనలు తెలిపారు. అనంతరం నందిపాటి ప్రభాకర్ మాట్లాడుతూ, తనపై నమ్మకంతో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాధ్యతలు అప్పగించిన సంఘం నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. సంఘాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు, సంఘటిత, అసంఘటిత రంగాల్లో పనిచేస్తున్న కార్మికుల సమస్యల పరిష్కారం, వారి హక్కుల సాధన కోసం నిస్వార్థంగా కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ ఎన్నికకు సహకరించిన రాష్ట్ర కమిటీ సభ్యులందరికీ ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర నాయకులు, కమిటీ సభ్యులు, పలువురు కార్మిక ప్రతినిధులు పాల్గొని నూతన రాష్ట్ర ప్రధాన కార్యదర్శికి శుభాకాంక్షలు తెలిపారు.

## నోట్ బుక్కులు, పెన్నులు, పెన్సిల్లు పంపిణీ



గరిడేపల్లి, ప్రజాస్ఫూర్తి : గరిడేపల్లి మండల పరిధిలో ఉన్న గారకుంట తండ గ్రామంలో గుగులోతు సందీప్ నాయక్ సరిత దంపతుల కుమారుడు పనిత్ శ్రీ పుట్టినరోజు సందర్భంగా గ్రామ పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు నోటుబుక్కులు పెన్నులు పెన్సిళ్లు పంపిణీ చేయడం జరిగింది గ్రామంలో యువకులు బర్తడే కానీ మరియు ప్రభుత్వ ఉద్యోగులు బర్తడే లు కానీ పెళ్లి రోజు కానీ జరుపుకునే ముందు గ్రామ విద్యార్థిని విద్యార్థులకు మరియు గ్రామ రామాలయానికి తమ వంతు సహాయ సహకారాలు అందించాలని వారు ప్రార్థించారు ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు, అంగన్వాడీ టీచర్ కవిత, గ్రామ సామాజిక సేవాకర్త నరేందర్ నాయక్, యువ నాయకుడు రవీందర్ నాయక్, నంద నాయక్, లాలు నాయక్, నీలా కాళియా నాయక్, గ్రామ మహిళలు, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్ క్యూ ఐ సేవలు అభినందనీయం

*** ఇండియా బిషప్ రమేష్ బాలన్**



ప్రజాస్ఫూర్తి, ఖమ్మం జిల్లా: స్పిరిట్ క్వెస్ట్ ఇంటర్నేషనల్ , ఎస్ క్యూ ఐ పెంతుకోడయాసిస్ చేసిన సేవలు అభినందనీయమని బిషప్ రమేష్ బాలన్ అన్నారు. సోమవారం నేలకొండపల్లి మండల పరిధిలో కొత్త కొత్తూరు లో దహించు అగ్ని కృపా ప్రార్థన మందిరం బిషప్ సతీష్ రెడ్డి, పాస్టర్ లలిత రెడ్డి, ఇండియా ఫైవ్ స్టేట్ బిషప్ ప్రకాష్, ఇండియా స్టాఫ్ పాస్టర్ ధన శేఖరన్, ఆధ్వర్యంలో మ్యారేజ్ లైసెన్సులు డిస్ట్రిబ్యూషన్, ఆర్డినేషన్ ఘనంగా జరిగింది. ఈ సంస్థ మారుమూల గ్రామాల్లో పరిచర్య చేస్తున్నటువంటి సేవకులను ప్రోత్సహించడం ముఖ్య ఉద్దేశం అన్నారు. సంస్థలో పనిచేస్తున్న పాస్టర్లకు సామాజిక, ఆరోగ్య భద్రతలను కల్పించినట్లు బిషప్ అన్నారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ ఆడం , మండల పాస్టర్లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రమాదాల నివారణకు ఆగస్టు 1 నుంచి జిల్లావ్యాప్తంగా 'అరైవ్ అలైవ్' స్పెషల్ డ్రైవ్'



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ప్రజాస్ఫూర్తి : రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నిబంధనలపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు ఆగస్టు 1 నుంచి జిల్లావ్యాప్తంగా 'అరైవ్ అలైవ్-స్పెషల్ డ్రైవ్' నిర్వహించనున్నట్లు జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ తెలిపారు. జిల్లా పోలీసు, రవాణాశాఖల సంయుక్త ఆధ్వర్యంలో ఈ ప్రత్యేక తనిఖీలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాల్లో అధికశాతం నిర్లక్ష్యపు డ్రైవింగ్, అతివేగం, ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘన, హెల్మెట్, సీటుబెల్ట్ వినియోగించకపోవడం వల్లే జరుగుతున్నాయని ఎస్పీ తెలిపారు. డ్రైవింగ్ లైసెన్స్ లేని మైనర్లు వాహనాలు నడపడం, హెల్మెట్ లేకుండా ప్రయాణించడం, ట్రిపుల్ రైడింగ్, మద్యం సేవించి వాహనాలు నడపడం, మొబైల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం, రాంగ్‌రూట్‌లో ప్రయాణించడం, అతివేగం తదితర ఉల్లంఘనలపై విస్తృత తనిఖీలు నిర్వహించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వడం చట్టవిరుద్ధమని, అలాంటి సందర్భాల్లో వాహన యజమానులు, తల్లిదండ్రులు లేదా సంరక్షకులపై కూడా మోటారు వాహనాల చట్టం ప్రకారం చర్యలు తీసుకునే అవకాశం ఉందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు వాహనాలు ఇవ్వకుండా బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.

## తిరుమల తరహాలో శ్రీశైలంలోనూ ఆన్‌లైన్ ప్రోటోకాల్ దర్శన టికెట్లు

శ్రీశైలం: శ్రీశైలం దేవస్థానం ధర్మకర్తల మండలి కీలక నిర్ణయాలు తీసుకుంది. ఛైర్మన్ రమేశ్ నాయుడు ఆధ్వర్యంలో సమావేశమైన సభ్యుల కమిటీ 39 అంశాలకు ఆమోదం తెలిపింది. శ్రీశైలం దేవస్థానం ప్రోటోకాల్ దర్శనాల్లో సంస్కరణలు చేపట్టినట్లు ఛైర్మన్ వెల్లడించారు. వచ్చే నెల 15 నుంచి తిరుమల తరహాలో శ్రీశైలంలోనూ ఆన్‌లైన్ ప్రోటోకాల్ టికెట్లు జారీ చేయనున్నట్లు తెలిపారు. ప్రాధాన్యతా క్రమంలో శ్రీశైలంలో శాశ్వత అభివృద్ధి పనులు చేపట్టబోతున్నట్లు చెప్పారు.

## మొక్కల పెంపకం.. ప్రతి ఒక్కరి బాధ్యత

**: దేవలమ్మ నాగారం గ్రామంలో వన మహోత్సవం**
**- సర్పంచ్ గౌరి శ్రీనివాస్ గౌడ్**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: మొక్కల పెంపకాన్ని ప్రతి ఒక్కరు బాధ్యతగా తీసుకోవాలని సర్పంచ్ గౌరి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. చౌటుప్పల్ మండలం దేవలమ్మ నాగారం గ్రామంలో మంగళవారం వన మహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచ్ గౌరీ శ్రీనివాస్ గౌడ్ చేతుల మీదుగా మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ గౌరీ శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ప్రతి ఇంటికి రెండు మొక్కల చొప్పున నాటాలని, నాటిన మొక్కలను సంరక్షించే బాధ్యత సైతం తీసుకోవాలన్నారు. మొక్కల పెంపకంతో అటవీ శాతం పెరిగి పర్యావరణ సమతుల్యత సాధ్యమవుతుందన్నారు. పుట్టినరోజు వేడుకల్లో భాగంగా ప్రతి ఒక్కరు ఒక మొక్కను నాటి సంరక్షించాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణతోనే మానవ మనుగడ సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ సుర్కంటి అనూప్ రెడ్డి, వార్డు సభ్యులు ఊదరి రమేష్, బొమ్మ అమరావతి, పంచాయితీ కార్యదర్శి సుధాకర్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

## వరికి ప్రత్యామ్నాయంగా అంతర పంటలు సాగు చేయాలి

**: కలెక్టర్ రాహుల్ శర్మ**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా , ప్రజాస్ఫూర్తి : సంప్రదాయ పంటలతో పోలిస్తే కూరగాయలు, అంతర పంటల సాగుతో రైతులు అధిక లాభాలు పొందవచ్చని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు దృష్టి సారించాలని సూచించారు. మంగళవారం బసవరాజుపల్లి గ్రామంలో పర్యటించిన కలెక్టర్.. రైతులు సాగు చేస్తున్న కూరగాయలు, అంతర పంటలను పరిశీలించారు. యాదగిరి, మార్త రమేష్, బోర రాజయ్యకు చెందిన క్షేత్రాల్లో పంటల సాగు విధానం, దిగుబడులు, యాజమాన్య పద్ధతులు, మార్కెటింగ్ అవకాశాలపై రైతులతో నేరుగా మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. తక్కువ పెట్టుబడితో తక్కువ సమయంలో మంచి ఆదాయం పొందేందుకు అంతర పంటల సాగు ఎంతో లాభదాయకమని పేర్కొన్నారు. నీటి వనరులను సద్వినియోగం చేసుకుంటూ కూరగాయల సాగు వైపు రైతులు మొగ్గు చూపాలని కలెక్టర్ సూచించారు. ఒకే పంటపై ఆధారపడకుండా అంతర పంటలు సాగు చేయడం ద్వారా చీడపీడల ఉధృతి తగ్గడంతోపాటు అదనపు ఆదాయం పొందవచ్చన్నారు. మల్చింగ్ విధానంతో అధిక దిగుబడులు సాధించవచ్చని, కూరగాయల సాగుతో కూలీల సమస్య కూడా కొంతవరకు తగ్గుతుందని రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. జిల్లాలోని ఇతర రైతులు కూడా బసవరాజుపల్లి రైతులను ఆదర్శంగా తీసుకుని ఆధునిక సాగు పద్ధతులను అవలంబించాలని కలెక్టర్ సూచించారు. రైతులకు కూరగాయలు, పప్పుదినుసుల సాగుపై వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులు విస్తృతంగా అవగాహన కల్పించాలని ఆదేశించారు. అనంతరం రైతుల వద్ద నుంచి కూరగాయలు కొనుగోలు చేసి డబ్బులు చెల్లించారు. బసవరాజుపల్లి రైతులు చేపట్టిన కూరగాయల సాగు విధానం, సాధిస్తున్న లాభాలు ఇతర రైతులకు తెలియజేసేందుకు సోమవారం ఐడీఓసీ కార్యాలయం వద్ద ప్రత్యేక స్టాల్ ఏర్పాటు చేయాలని ఉద్యానవన శాఖ అధికారిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవన శాఖ అధికారి తిరుపతి, తహసీల్దార్ లక్ష్మి రాజయ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.



## వ్యవసాయ సాంకేతికత వైపు ప్రభుత్వం అడుగులు

*** జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్**

ప్రజాస్ఫూర్తి, మెదక్ జిల్లా: రామాయంపేట మండల కేంద్రంలోని రైతు వేదిక నుంచి రైతు నేస్తం కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ, రైతు వేదికలో నిర్వహించే రైతు నేస్తం కార్యక్రమంలో రైతులందరూ పెద్ద ఎత్తున పాల్గొన్నారని అన్నారు. రైతు నేస్తం కార్యక్రమం ద్వారా వ్యవసాయ సంబంధ అనేక అంశాలపై రైతులకు విస్తృత అవగాహన కలుగుతుందని చెప్పారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులను బట్టి పంటలు సాగుచేసుకోవాలని రైతులకు సూచించారు. జిల్లాలో కోతుల సమస్య నివారించేందుకు ప్రణాళికలు చేస్తున్నామని, కోతుల నివారణ కోసం జిల్లా అధికారులు ఆదిలాబాద్ జిల్లాను త్వరలో పర్యటిస్తారు అన్నారు. కోతుల నివారణకు అదిలాబాద్ జిల్లాలో అవలంబించిన పద్ధతులను అధ్యయనం చేసి మెదక్ జిల్లాలో ప్రతిష్టమైన ప్రణాళికతో కోతుల నివారణ చేయనున్నట్లు తెలిపారు. అనంతరం ఉత్తమ రైతులు, వ్యవసాయ అధికారులను అభినందించి, వారికి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్ ఉద్యానవన పంటల అధికారి ప్రతాప్ సింగ్, రామయంపేట మున్సిపల్ చైర్ పర్సన్ , వైస్ చైర్మన్ కౌన్సిలర్లు ప్రజాప్రతినిధులు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో రఘునాథపల్లి గ్రామ దేవతలకు మొక్కులు

రఘునాథపల్లి, ప్రజాస్ఫూర్తి : రఘునాథపల్లి టూర్స్ అండ్ ట్రావెల్స్ ఆధ్వర్యంలో మంగళవారం రఘునాథపల్లి గ్రామ దేవతలకు భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించుకుని, పండుగను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలో ట్రావెల్స్ సభ్యులంతా పాల్గొని దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి గౌరవ అధ్యక్షులు వై. కుమార్ గౌడ్, లీగల్ అడ్వైజర్ కొయ్యడ మల్లేష్ గార్లు ముఖ్య అతిథులుగా హాజరై, పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రఘునాథపల్లి టూర్స్ అండ్ ట్రావెల్స్ అధ్యక్షుడు పెంతల సందీప్ రెడ్డి, ఉపాధ్యక్షులు ఎండి. రంజాన్, అమృతం కుమార్, ప్రధాన కార్యదర్శి రేసు కుమార్, కార్యదర్శి నాసగోని సుమన్ పాల్గొన్నారు. అలాగే కమిటీ సభ్యులు కూరపాటి సుధాకర్, ఎస్కే. ఇంతియాజ్, బాల్నే నాగరాజు, పుప్పాల రవి, పెండ్లి రంజిత్, షాహిద్ పాషా, కొయ్యల యాదగిరి, బుంగాని సురేష్, దర్గా స్వామి తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## వరి నాట్లకు తొందరొద్దు

*** ఎల్‌నినో ఎఫెక్ట్.. ఆరుతడి పంటలే బెస్ట్!**




జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ప్రజాస్ఫూర్తి : ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో రైతులు ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు సూచించారు. మంగళవారం గణపురం మండల కేంద్రంలోని రైతు వేదికలో జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 'రైతు నేస్తం' కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులను ఉద్దేశించి మాట్లాడారు. ఎల్‌నినో ప్రభావంతో దేశవ్యాప్తంగా, రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు నెలకొనే అవకాశం ఉన్నందున రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టిసారించాలని సూచించారు. వ్యవసాయ రంగ అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, సాగునీటి సౌకర్యాలు, సాంకేతిక సలహాలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంబించి అధిక దిగుబడులు సాధించాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు మాట్లాడుతూ.. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు ఆశించిన స్థాయిలో కురవడం లేదని, రైతులు వ్యవసాయశాఖ అధికారులు అందించే సూచనలు, సలహాలను తప్పనిసరిగా పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతు సంఘాల నాయకులు, రైతులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## భద్రతే విజయానికి మూలం

*** భవిష్యత్తులో మరిన్ని అవార్డులు సాధించాలి: జీఎం రాజేశ్వర్‌రెడ్డి**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ప్రజాస్ఫూర్తి : గనుల్లో భద్రతకు అత్యున్నత ప్రాధాన్యం ఇవ్వడం వల్లే కేటీకే-5 ఇన్‌క్లైన్‌కు ప్రతిష్ఠాత్మక భద్రతా అవార్డు దక్కిందని సింగరేణి భూపాలపల్లి ఏరియా జీఎం ఏనుగు రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం తొలి షిఫ్ట్ ప్రారంభానికి ముందు కేటీకే-5 ఇన్‌క్లైన్‌ను సందర్శించిన ఆయన.. 56వ వార్షిక భద్రతా పక్షోత్సవం-2025లో గ్రూప్-2 గనుల విభాగంలో ఓవరాల్ ఫస్ట్ ప్రైజ్ సాధించినందుకు అధికారులు, ఉద్యోగులు, సిబ్బందిని అభినందించారు. అవార్డు సాధన వెనుక ఉద్యోగుల అప్రమత్తత, భద్రతా నిబంధనల పట్ల అంకితభావం, సమష్టి కృషి ఉన్నాయని పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో మరిన్ని భద్రతా అవార్డులు సాధించి కేటీకే-5 ఇన్‌క్లైన్‌తో పాటు భూపాలపల్లి ఏరియా, సింగరేణి సంస్థకు మరింత పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గని మేనేజర్ మాచర్ల రమేష్, సేఫ్టీ ఆఫీసర్ పి.అభిషేక్, పిట్ ఇంజనీర్ శ్రీకాంత్, వెంటిలేషన్ ఆఫీసర్ రమేష్, వెల్ఫేర్ ఆఫీసర్ సందీప్, గుర్తింపు పొందిన, ప్రాతినిధ్య కార్మిక సంఘాల పిట్ కార్యదర్శులు రాజేందర్, గట్టురాజు, వర్క్‌మెన్ ఇన్‌స్పెక్టర్లు, సీనియర్ సిబ్బంది, ఉద్యోగులు పాల్గొన్నారు.

## ఛలో హైదరాబాద్ జయప్రదం చేయండి..

*** సీపీఎస్ ఈయూ జిల్లా అధ్యక్షుడు చంద్రకంటి శశిధర్**

కూసుమంచి, ప్రజా స్ఫూర్తి: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా పాత పెన్షన్ ను పునరుద్ధరించాలని డిమాండ్ తో ఆగస్టు 23 న టిఎస్ సిపిఎస్ ఈయూ చేపట్టనున్న ఛలో హైదరాబాద్ కార్యక్రమాన్ని ఉద్యోగ, ఉపాధ్యాయులు జయప్రదం చేయాలని సిపిఎస్ ఈయూ ఖమ్మం జిల్లా అధ్యక్షులు చంద్రకంటి శశిధర్ పిలుపునిచ్చారు. మంగళవారం కూసుమంచి మండలం కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో మూడు రోజుల ఉపాధ్యాయల శిక్షణ కార్యక్రమం భోజన విరామ సమయంలో వారిని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ పెన్షన్ అనేది ఉద్యోగికి ఇచ్చే భిక్షం కాదని, తమ హక్కుగా ప్రభుత్వం గుర్తించాలని కోరారు. అనంతరం మండల విద్యాధికారి రాయల వీరస్వామి చేతుల మీదుగా ఆగస్టు 23న చేపట్టిన ఛలో హైదరాబాద్ గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎస్ బాధ్యులు బత్తుల ఉపేందర్, మందుల బిక్షం, ఆవునూరి శ్రీదేవి, పీఆర్టీయు బాధ్యులు శీలం ఆంజనేయులు, యుటిఎఫ్ బాధ్యులు మండవ నరసయ్య, టిపిటిఎఫ్ ఉపేందర్ తో పాటుగా నవీన్, రాంబాబు, సాయికుమార్, ఇనపనూరి ముత్తయ్య, నరేష్, రామకృష్ణ, సురేష్, నవ్య, చైతన్య, సాయి లక్ష్మి, చిట్టి, శ్రీలక్ష్మి, రిజ్వాన, తదితర సిపిఎస్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే కఠిన చర్యలు

* **నిబంధనలు ఉల్లంఘిస్తే ఆసుపత్రులపై క్రిమినల్ కేసులు**
* **డీఎంహెచ్‌వో డాక్టర్ కె. రాహుల్**




ప్రజాస్ఫూర్తి, నల్లగొండ : జిల్లాలో అనుమతులు లేకుండా ప్రైవేటు ఆసుపత్రులు, డయాగ్నస్టిక్ కేంద్రాలు, అల్ట్రాసౌండ్ స్కానింగ్ కేంద్రాలు నిర్వహించరాదని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె. రాహుల్ హెచ్చరించారు. గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించినా, వాటికి సహకరించినా పీసీపీఎన్‌డీటీ చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.నల్లగొండలోని ఐఎంఏ హాలులో శనివారం ప్రైవేటు ఆసుపత్రుల వైద్యులు, యాజమాన్యాల కోసం నిర్వహించిన క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ చట్టం-2010, పీసీపీఎన్‌డీటీ చట్టం-1994, ఎం.టి.పి. చట్టం అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.జిల్లాలోని ప్రతి ప్రైవేటు వైద్య సంస్థ చెల్లుబాటు అయ్యే నమోదు ధ్రువీకరణతోనే సేవలు అందించాలని, కనీస ప్రమాణాలు, మౌలిక సదుపాయాలు, బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ, అగ్నిమాపక భద్రత, చట్టపరమైన రికార్డుల నిర్వహణ తప్పనిసరిగా పాటించాలని సూచించారు. నిబంధనలను ఉల్లంఘించే ఆసుపత్రులు, స్కానింగ్ కేంద్రాలపై కేసులు నమోదు చేయడంతో పాటు జరిమానాలు, రిజిస్ట్రేషన్ రద్దు వంటి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఉప జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె. నగేష్ మాట్లాడుతూ చట్టాల అమలులో వైద్యులు పూర్తి సహకారం అందించాలని కోరారు. ఆరోగ్య విద్య విస్తరణాధికారి ఏ. అంజయ్య గౌడ్ క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ చట్టం, పీసీపీఎన్‌డీటీ చట్టం, ఎం.టి.పి. చట్టాల ముఖ్య నిబంధనలు, ఆసుపత్రుల బాధ్యతలు, రిజిస్ట్రేషన్, రికార్డుల నిర్వహణ, చట్ట ఉల్లంఘనలకు సంబంధించిన శిక్షలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.ఈ కార్యక్రమంలో ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రమేష్ నాయక్, కార్యదర్శి డాక్టర్ విజయ్ కుమార్, కోశాధికారి డాక్టర్ కె. ప్రవీణ్, డాక్టర్ వసంత కుమారి, డాక్టర్ ఎ. పుల్లారావు, డాక్టర్ పి.వి.ఎన్. మూర్తితో పాటు పలువురు ప్రైవేటు ఆసుపత్రుల వైద్యులు, యాజమాన్య ప్రతినిధులు పాల్గొన్నారు.

# పాము కాటుతో పదో తరగతి విద్యార్థి మృతి



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ప్రజాస్ఫూర్తి : పాము కాటుతో పదో తరగతి విద్యార్థి మృతి చెందిన విషాదకర ఘటన మండల కేంద్రమైన తాడిచర్ల గ్రామంలో మంగళవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. గ్రామస్థులు, కొయ్యూరు ఎస్ఐ మహేందర్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. తాడిచర్లకు చెందిన ఎండీ రిజ్వాన్ (16) పదో తరగతి చదువుతున్నాడు. రిజ్వాన్ తండ్రి అక్బర్ కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ భూపాలపల్లిలోని 100 పడకల ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆయనకు తోడుగా భార్య కూడా ఆసుపత్రిలోనే ఉండటంతో రిజ్వాన్ సోమవారం రాత్రి ఇంట్లో ఒంటరిగా నిద్రించాడు. మంగళవారం తెల్లవారుజామున ప్రమాదవశాత్తు పాము కాటుకు గురయ్యాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, బంధువులు అత్యవసర చికిత్స కోసం భూపాలపల్లి 100 పడకల ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు. తండ్రి అక్బర్ ఫిర్యాదు మేరకు కొయ్యూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**కన్నీరుమున్నీరైన తల్లిదండ్రులు**

చేతికందివచ్చిన కుమారుడు అకాల మృత్యువాత పడటంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. తమతో కలిసి నిన్నటి వరకు పాఠశాలలో చదువుకున్న రిజ్వాన్ మృతి చెందడంతో తోటి పదో తరగతి విద్యార్థులు కన్నీటి పర్యంతమయ్యారు.

# ధాన్యం కొనుగోలు అమ్మకాలపైన శ్వేత పత్రం విడుదల చేయాలి




ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: రాష్ట్ర ప్రభుత్వంలోని ప్రముఖులు భారత ఆహార సంస్థను వ్యాపార సంస్థగా మలచి తద్వారా డబ్బులు సంపాదిస్తున్నారని దాన్ని అడ్డం పెట్టుకొని పెద్ద ఎత్తున దందా నడుస్తున్నదని తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా అధ్యక్షులు మామిడి అంజయ్య ధ్వజమెత్తారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సూర్యాపేటలోని వజ్రా రైస్ ఇండస్ట్రీలో ఇవ్వవలసిన దాన్ని తక్కువగా ఉందని ఆరోపిస్తూ వట్టే జానయ్య యాదవ్ పైన నీలాప నిందలు వేస్తున్నారని ఈ అంశాలపై వివరణ ఇచ్చినందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. భారత ఆహార సంస్థ లాభాపేక్ష లేకుండా నడపవలసిన సంస్థను దుర్వినియోగం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ప్రభుత్వం దాన్యం కొనుగోలు చేసి తమ దగ్గర దాచుకోవడానికి స్థలం లేక అడ్డగోలుగా మిల్లుల వద్ద డంపు చేసి తిరిగి బియ్యం తీసుకునే సమయంలో పద్ధతి ప్రకారం ఇవ్వాలని ప్రభుత్వం మాట్లాడటం అన్యాయమని అన్నారు. ధాన్యం మూడు సంవత్సరాల తర్వాత ఎంత తరుగు పోతుందో ఒక్కసారి కూడా ఈ ప్రభుత్వం గమనించదని, మిల్లర్లను బెదిరించి కోట్ల రూపాయలు గడిస్తున్నారని ఆయన ఆరోపించారు. గోదాంలలో స్థలం లేకపోవడం వలన మూడు నెలల రేషన్ బియ్యం ఒకేసారి ఇస్తున్నారని అన్నారు. వట్టె జానయ్య యాదవ్ పై జరిగే దాడిని తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఖండిస్తుందని ఎక్కడికక్కడ ప్రభుత్వ అధికారులకు విన్నవించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి మీర్ అక్బర్, పట్టణ అధ్యక్షుడు కుంభం నాగరాజు, మహిళా విభాగం అధ్యక్షురాలు కొన్నె మంజుల గౌడ్, ప్రధాన కార్యదర్శి నారాయణదాసు కవిత, ఆవుల అంజయ్య,బొల్లె సైదులు, కోల కరుణాకర్, నెలచర్ల మధు ప్రజాపతి, సత్తు నాగయ్యతదితరులు పాల్గొన్నారు.

# హై కోర్టు ఇచ్చిన ఆదేశం పేద ప్రజల విజయం

* **బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్**



జీడిమెట్ల, ప్రజాస్ఫూర్తి : హైడ్రా కమిషనర్ రంగనాథ్ ను తొలగించాలని హై కోర్టు ఇచ్చిన ఆదేశం పేద ప్రజల విజయం ,అధర్మం పై ధర్మం సాధించిన విజయమని బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ అన్నారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ వ్యవహార తీరుపై రాష్ట్ర హైకోర్ట్ చేసిన వ్యాఖ్యలను స్వాగతిస్తూ మంగళవారం పేట్ బషీరాబాద్ లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ మీడియ ముఖంగా హైడ్రా ద్వారా ప్రభుత్వం సాగించిన దురాక్రమ పాలన, హైడ్రా కమిషనర్ వ్యవహార శైలిపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిట్టింగ్ హై కోర్ట్ జడ్జితో హైడ్రా ఆగడాలు, దోపిడిపై పై సత్వర విచారణ చేపట్టాలన్నారు. హై కోర్టు తీర్పు బీ ఆర్ ఎస్ పేదల పక్షాన సాగిస్తున్న పోరాటానికి వచ్చిన ప్రతిఫలమన్నారు. రేవంత్ రెడ్డి హిట్లర్ పోకడలకు ఈ తీర్పు చెంప పెట్టు అన్నారు. ఏ వ్యవస్థలైన బాబా సాహెబ్ అంబెద్కర్ రాసిన రాజ్యాంగం ప్రకారం పని చేయాల్సిందే కానీ ఎనుముల రేవంత్ రెడ్డి రాజ్యాంగం ప్రకారం కాదని హైడ్రా కమిషనర్ ను తొలగించాలని ఇచ్చిన తీర్పు రుజువు చేసిందన్నారు. రేవంత్ రెడ్డి మున్సిపల్ శాఖ కిందే హైడ్రా పని చేస్తోందని, హై కోర్టు తీర్పు తో రేవంత్ రెడ్డి మున్సిపల్ శాఖల మంత్రిగా కొనసాగే నైతిక అర్హతను కోల్పోయారన్నారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసినట్టే రేవంత్ రెడ్డి మున్సిపల్ శాఖ మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విపత్తుల సమయం లో ప్రజలకు అండగా ఉండాల్సిన హైడ్రా ప్రజలను విపత్తుల్లోకి నెడుతోందన్నారు. తమకు నచ్చిన వారికి నజరానా నచ్చని వారికి జరిమానా అనే విధానాన్ని అమలు చేయడానికి రేవంత్ రెడ్డి హైడ్రా ను దుర్వినియోగం చేస్తున్నారన్నారు. హైడ్రా తో ప్రజలకు జరిగిన మేలు గోరంత ..జరిగిన నష్టం కొండంత అన్నారు. హై కోర్టుకు సారీ చెప్పిన రంగనాథ్ తనను తొలగించాలని న్యాయస్థానం ఆదేశం ఇచ్చిన తర్వాత తన చర్యలని సమర్థించుకోవడం ఎంతవరకు సబబు అని అన్నారు. న్యాయ వ్యవస్థను గౌరవిస్తారా లేదంటే ఓ వ్యక్తి దుర్మార్గాలను ప్రోత్సహిస్తారా రేవంత్ రెడ్డి తేల్చుకోవాలన్నారు. బుల్డోజర్ రాజ్ వైపా రూల్ బుక్ వైపా అనేది రేవంత్ రెడ్డి నిర్ణయించుకోవాలన్నారు. హైడ్రా లాంటి వ్యవస్థ పేద,మధ్యతరగతి వర్గాల పాలిట హైడ్రోజన్ బాంబు లా మారిందన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ బీ ఆర్ ఎస్ అధికారం లోకి వచ్చిన వెంటనే హైడ్రా భూతాన్ని తరిమికొడతామని ,మొదటి నిర్ణయం ఇదే అవుతుందని జగిత్యాల సభలో కుండబద్దలు కొట్టినట్టు చెప్పారన్నారు. రంగనాథ్ పోయి ఇంకో రంగయ్య వచ్చినా రేవంత్ హిట్లర్ పోకడలు మానక పోతే హైడ్రా తీరు మారదన్నారు. చేసిన దుర్మార్గాలు చాలవన్నట్టు హైడ్రా కు మరిన్ని అధికారాలు కట్టబెట్టేందుకు రేవంత్ రెడ్డి ప్రయత్నిస్తున్నారన్నారు. బిఆర్ఎస్ నేతల రక్తం తో పొలాలు పండించాలన్న రేవంత్ రెడ్డి హైడ్రా తో ప్రజల రక్త మాంసాలు కండ్ల జూస్తున్నారన్నారు. తనకు హిట్లర్ ఆదర్శమన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తప్ప ఈ దేశం లో ఎవరైనా ఉన్నారా? రాహుల్ గాంధీ రాజ్యాంగం పట్టుకుని తిరుగుతూ నీతులు చెబుతారన్నారు. రాష్ట్రంలో రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తున్న రేవంత్ రెడ్డి పై రాహుల్ గాంధీ మౌనం అనేక అనుమానాలు ఉన్నాయన్నారు. రేవంత్ రెడ్డి బ్లాక్ మెయిల్ కు బ్రాండ్ అంబాసిడర్ అని, రేవంత్ బ్లాక్ మెయిల్ కు రాహుల్ గాంధీ కూడా బాధితుడిగా మారి రాష్ట్రం లో రాక్షస పాలన నడుస్తున్నా దృతరాష్ట్రుడిలా మారిపోయారా అన్నారు. రాహుల్ గాంధీ అధికారం లోకి వస్తే జెన్ జీ తరానికి విద్యాశాఖ మంత్రిగా భాద్యతలు అప్పగిస్తామని రేవంత్ చెప్పడం మిలీనియం జోక్ అన్నారు. రాహుల్ అధికారంలోకి వస్తే రేవంత్ రెడ్డి మంత్రులను నియమిస్తాడా ? ఇంట్లో ఈగల మోత బయట పల్లకీల మోత అన్నట్టు ఉంది రేవంత్ వ్యవహారమన్నారు. విద్యా శాఖ మంత్రిగా రేవంత్ విఫలమయ్యారు. జెన్ జీ మీద అంత ప్రేమ ఉంటే తన స్థానం లో 30 యేండ్ల లోపున్న కాంగ్రెస్ ఎమ్మెల్యే ను విద్యా శాఖ మంత్రిగా నియమించొచ్చు కదా. రోజుకో డ్రామా ,దినానికో డైవర్షన్ తో రేవంత్ రెడ్డి ప్రజలను మభ్య పెట్టాలనుకుంటున్నారు. ప్రజలకు రేవంత్ మాయ మాటలన్నీ అర్థమై పోయాయి ..ఇక మసిపూసి మారేడు కాయ చేస్తానంటే కుదిరే కాలం పోయిందన్నారు. హైడ్రా కమిషనర్ పై హైకోర్టు తీర్పు తో రేవంత్ రెడ్డికి కౌంట్ డౌన్ మొదలైందన్నారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ ను తొమ్మిది తలల సర్పమని హై కోర్టు అంటే రేవంత్ రెడ్డి ని పది తలల రావణుడని ప్రజలు అంటున్నారు. రేవంత్ రావణ పాలన పోవడం ఖాయం కేసీఆర్ రాముడి పాలన రావడం ఖాయమన్నారు.

# మధుసూదనాచారిపై విమర్శలు చేస్తే సహించేది లేదు




జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ప్రజాస్ఫూర్తి : బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, ఉద్యమకారుడు సిరికొండ మధుసూదనాచారిపై కొందరు చేస్తున్న విమర్శలను తీవ్రంగా ఖండిస్తూ ఆ పార్టీ సీనియర్ నాయకులు, ఉద్యమకారులు ధీటుగా బదులిచ్చారు. మంగళవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. మధుసూదనాచారి నిఖార్సైన ప్రజా సేవకుడని, నిబద్ధత కలిగిన ప్రజానాయకుడని కొనియాడారు. నాలుగు దశాబ్దాల రాజకీయ ప్రస్థానంలో విలువలకు కట్టుబడి పనిచేసిన నాయకుడిగా ఆయనకు పేరుందని పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీ వ్యవస్థాపక సభ్యుల్లో మధుసూదనాచారి ఒకరని, పార్టీ అధినేత కేసీఆర్‌తో ఆది నుంచి నేటి వరకు అనునిత్యం కలిసి నడిచిన నాయకుడని గుర్తుచేశారు. అలాంటి మహానాయకుడిపై అవాకులు, చెవాకులు పేలితే సహించేది లేదని, ఇకనైనా విమర్శలు మానుకోవాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు లెంకల రాజిరెడ్డి, చింతల రమేష్, మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ భర్త బండారి రవి, రత్నం రవి, బీసీ సంక్షేమ సంఘం నాయకుడు మునికుంట్ల వెంకట్, గోపు బిక్షపతి, మాజీ ఎంపీపీ ఈర్ల సదానందం, కోల రవి, టీజీబీకేఎస్ నాయకులు కిరణ్, సుధాకర్, సీనియర్ నాయకులు అగుర్ల శ్రీనివాస్, నర్సింగ్, ఐలుమల్లు, మహిళా నాయకులు మేకల రజిత, జెరుపుల గంగా, షరీఫ్, యువజన నాయకులు సుర రాజేష్, రంజిత్ గౌడ్, పూర్ణ యాదవ్, సంతోష్, అనిల్, సుగుణాకర్, ఈర్ల రాజు, వంశీ, ప్రభాకర్, బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

# 550కు పైగా మార్కులు సాధిస్తే రూ.10 వేల ప్రోత్సాహకం




జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ప్రజాస్ఫూర్తి : జడ్పీహెచ్ఎస్ గోర్లవీడు పాఠశాలను శాసనమండలి సభ్యుడు పింగిలి శ్రీపాల్‌రెడ్డి సందర్శించారు. జిల్లాలో జరిగిన ఓ ఉద్యోగ విరమణ కార్యక్రమానికి హాజరైన ఆయనను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అనిత ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఆహ్వానించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి శ్రీపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. బాల్యదశలో అలవర్చుకునే విద్య, సత్ప్రవర్తన, క్రమశిక్షణ, గురువులు, తల్లిదండ్రులు, పెద్దల పట్ల గౌరవభావం భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించేందుకు బలమైన పునాదులవుతాయన్నారు. గురువులు, తల్లిదండ్రులు, పెద్దలను గౌరవించే విద్యార్థులే జీవితంలో ఉన్నత స్థానాలను అధిరోహిస్తారని పేర్కొన్నారు. రానున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో 550కు పైగా మార్కులు సాధించిన ప్రతి విద్యార్థికి రూ.10 వేల చొప్పున నగదు ప్రోత్సాహక బహుమతి అందజేస్తానని ప్రకటించారు. పాఠశాల అభివృద్ధికి అవసరమైన నిధుల మంజూరుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఉపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ఉపాధ్యాయుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం పీఆర్సీ సాధన, సీపీఎస్ రద్దు లక్ష్యంగా త్వరలో ఉద్యమ కార్యాచరణ చేపడతామని తెలిపారు. ఉపాధ్యాయులంతా ఐక్యంగా ఉద్యమంలో పాల్గొని, హక్కుల సాధన జరిగే వరకు పోరాట స్ఫూర్తితో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా సంఘ ప్రధాన కార్యదర్శి కిరణ్‌కుమార్, హనుమకొండ, వరంగల్ జిల్లాల బాధ్యులు మందల తిరుపతిరెడ్డి, పలిత శ్రీహరి, ఈదునూరి రవీందర్‌రెడ్డి, నక్కిరెడ్డి మహేందర్, గఫార్, మండల బాధ్యులు రఘునాథ్‌రెడ్డి, కుసుమ వెంకటేశ్వర్లు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్థానిక సర్పంచ్ లావణ్య, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ఢిల్లీ వరల్డ్ స్కూల్ విద్యార్థుల సహజ వ్యవసాయ క్షేత్ర సందర్శన




ప్రజాస్ఫూర్తి . షాద్నగర్ : షాద్ నగర్ ఢిల్లీ వరల్డ్ స్కూల్ విద్యార్థులు కేశంపేటలోని సహజ వ్యవసాయ క్షేత్రాన్ని మంగళవారం సందర్శించారు. మానవాళికి ఆహారాన్ని అందించే రైతు ప్రాముఖ్యతను, ప్రకృతి ఎదురొడ్డే సవాళ్లను క్షేత్రస్థాయిలో విద్యార్థులకు ఉపాధ్యాయ బృందం, స్థానిక రైతులు వివరించారు. ఈ పర్యటనలో భాగంగా విద్యార్థులు పలు సహజ వ్యవసాయ పద్ధతులపై అవగాహన పెంచుకున్నారు. సాంప్రదాయక పద్ధతిలో ఎడ్ల సాయంతో నడిచే గానుగ నూనె తయారీని, వర్షపు నీటి సంరక్షణ విధానాలను ప్రత్యక్షంగా చూశారు. అలాగే గోబర్ గ్యాస్ ప్లాంట్, దేశీ ఆవుల పోషణ, ప్రకృతి సమతుల్యతను కాపాడే ఫుడ్ ఫారెస్ట్ మోడల్ మరియు ఫైవ్‌లేయర్ మోడల్ సాగు పద్ధతుల్లో పాల్గొని క్రియాశీలక అనుభవాన్ని పొందారు.వాతావరణ మార్పులు, కరువు కాటకాలు, దిగుబడి ఉన్నా సరైన మద్దతు ధర లభించక రైతులు ఎదుర్కొంటున్న కష్టాలను అధిగమించడానికి ఇటువంటి సహజ సాగు పద్ధతులు ఎంతగానో ఉపయోగపడతాయని విద్యార్థులు తెలుసుకున్నారు. ఈ క్షేత్ర సందర్శన తమకు ఎంతో జ్ఞానాన్ని, సమాజంలో రైతు పాత్ర ఎంత కీలకమైందో నేర్పించిందని విద్యార్థులు తెలిపారు.

# చెరువులో అనుమానాస్పదంగా చేపల మృతి

* **కమలాపూర్‌లో కలకలం.. విష ప్రయోగంపై అనుమానాలు**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ప్రజాస్ఫూర్తి : భూపాలపల్లి మండలం కమలాపూర్ గ్రామంలోని పెద్ద చెరువులో భారీ సంఖ్యలో చేపలు మృతి చెందడం స్థానికంగా కలకలం రేపుతోంది. మృతిచెందిన చేపలు పెద్ద సంఖ్యలో చెరువుగట్టుకు కొట్టుకురావడంతో గ్రామస్తులు ఆందోళనకు గురవుతున్నారు. చేపల మృతికి అసలు కారణం ఏమిటనేది తెలియకపోవడంతో స్థానికుల్లో అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ముందుజాగ్రత్త చర్యల్లో భాగంగా చెరువు నీటిని మనుషులు, పశువులు వినియోగించకుండా అప్రమత్తంగా ఉండాలని గ్రామ పెద్దలు సూచిస్తున్నారు. చెరువు పరిసర ప్రాంతాలకు వెళ్లవద్దని ప్రజలను హెచ్చరిస్తున్నారు. చేపల మృతికి విష ప్రయోగం కారణమై ఉండొచ్చన్న అనుమానాలను కొందరు గ్రామస్తులు వ్యక్తం చేస్తున్నారు. చెరువు నీటిలో ఏదైనా విషపదార్థం కలిసిందా? లేక ఇతర కారణాలతో చేపలు మృతి చెందాయా? అనే విషయాలను శాస్త్రీయంగా నిర్ధారించాల్సిన అవసరం ఉందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. చేపల మృతికి గల కారణాలను వెంటనే గుర్తించి, చెరువు నీటి నమూనాలను సేకరించి పరీక్షలు నిర్వహించాలని అధికారులను కోరుతున్నారు. అంతేకాకుండా, చెరువులో విషపదార్థాలు కలిపినట్లు తేలితే బాధ్యులను వెంటనే గుర్తించి, వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. ఈ ఘటనపై సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి, వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

# ఘనంగా ఆషాడ మాస అమ్మవారి బోనాలు



శేరిలింగంపల్లి, ప్రజాస్ఫూర్తి : ఆషాడ మాసం సందర్భంగా హైదర్‌నగర్‌లోని మైసమ్మ అమ్మవారి దేవాలయంలో అమ్మవారి బోనాల వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మాదాపూర్ డివిజన్ పరిధిలోని ఖానమేట్ గ్రామానికి చెందిన, శేరిలింగంపల్లి కాంగ్రెస్ సీనియర్ నాయకులు గణేష్ యాదవ్ మంగళవారం బోనం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అమ్మవారిని భక్తిశ్రద్ధలతో దర్శించుకుని, రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, అమ్మవారి కృపాకటాక్షాలు ప్రతి కుటుంబంపై ఉండాలని ప్రార్థించారు. ఆషాడ మాసంలో అమ్మవారికి బోనం సమర్పించడం తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని పాల్గొన్న నాయకులు పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ జగదీశ్వర్ గౌడ్, గంగల నరసింహ యాదవ్, కాంగ్రెస్ నాయకులు మారబోయిన అనిల్ కుమార్ యాదవ్, గంగల జంగయ్య యాదవ్, గంగల మల్లేష్ యాదవ్, బీజేపీ సీనియర్ నాయకులు గంగల రాధాకృష్ణ యాదవ్, ఉప్పల ఏకాంత్ గౌడ్, నారగోని కృష్ణగౌడ్తో పాటు పలువురు సోదరులు, బంధుమిత్రులు, స్థానిక భక్తులు పాల్గొన్నారు.

# భూపాలపల్లి బీఆర్ఎస్‌లో ముసలం.. బహిరంగ విమర్శలతో ముదిరిన విభేదాలు

*** మధుసూదనాచారి వర్గం, గండ్ర వర్గం మధ్య మాటల యుద్ధం**





జయశంకర్ భూపాలపల్లి జిల్లా , ప్రజాస్ఫూర్తి : భూపాలపల్లి బీఆర్ఎస్‌లో అంతర్గత విభేదాలు మరోసారి బహిర్గతమయ్యాయి. మాజీ శాసనసభాపతి సిరికొండ మధుసూదనాచారి, మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి వర్గాల మధ్య కొంతకాలంగా కొనసాగుతున్న రాజకీయ విభేదాలు తాజాగా బహిరంగ విమర్శలకు దారితీశాయి. ఇరు వర్గాల నేతలు వేర్వేరుగా విలేకరుల సమావేశాలు నిర్వహించి పరస్పరం విమర్శలు చేసుకోవడంతో నియోజకవర్గ బీఆర్ఎస్ రాజకీయాలు వేడెక్కాయి.

*** మధుసూదనాచారి ఏ పార్టీ నుంచి పోటీ చేస్తారో చెప్పాలి**

భూపాలపల్లి పట్టణ బీఆర్ఎస్ కార్యకర్తలు నిర్వహించిన సమావేశంలో గండ్ర వర్గం నేతలు మాట్లాడుతూ.. పార్టీని విచ్ఛిన్నం చేసే ప్రయత్నాలను మానుకోవాలని డిమాండ్ చేశారు. భూపాలపల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జిగా మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డిని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అధికారికంగా ప్రకటించిన విషయాన్ని గుర్తుచేశారు. పార్టీ అధిష్ఠానం నిర్ణయాన్ని గౌరవించకుండా సమాంతర కార్యక్రమాలు, వర్గ రాజకీయాలు నిర్వహించడం సరికాదన్నారు. మాజీ శాసనసభాపతి మధుసూదనాచారి ఏ పార్టీ తరఫున ఎమ్మెల్యేగా పోటీ చేయబోతున్నారో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. వ్యక్తిగత ప్రకటనలతో పార్టీ శ్రేణుల్లో గందరగోళం సృష్టించవద్దని సూచించారు.మధుసూదనాచారి సీనియర్ నాయకుడని, తెలంగాణ ఉద్యమంలో ఆయన పాత్రను తాము గౌరవిస్తామని పేర్కొన్న వారు.. పార్టీని బలోపేతం చేయడంలో ఆయన కీలకంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. అయితే నియోజకవర్గంలో పార్టీని, కార్యకర్తలను విభజించేలా వ్యవహరించడం సరికాదని వ్యాఖ్యానించారు. పార్టీ అభ్యర్థులను ప్రకటించే అధికారం అధిష్ఠానానిదేనని, ఎన్నికల సమయంలో పార్టీ నిర్ణయమే తుది నిర్ణయమని స్పష్టం చేశారు.

*** వ్యక్తిగత విమర్శలు తగవు**

మరోవైపు మధుసూదనాచారి వర్గం నేతలు గండ్ర వర్గం తీరుపై మండిపడ్డారు. మాజీ శాసనసభాపతి వంటి సీనియర్ నాయకుడిపై వ్యక్తిగత విమర్శలు చేయడం తగదన్నారు. మధుసూదనాచారి తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించడంతో పాటు భూపాలపల్లి జిల్లా ఏర్పాటు, అభివృద్ధిలోనూ ముఖ్య భూమిక పోషించారని గుర్తుచేశారు. అలాంటి నాయకుడిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం ఉద్యమ చరిత్రను అవమానించడమేనని అన్నారు. మధుసూదనాచారిపై వ్యక్తిగత విమర్శలు కొనసాగిస్తే రాజకీయంగా తగిన సమాధానం ఇస్తామని హెచ్చరించారు. అవసరమైతే ప్రజాక్షేత్రంలోనే బదులిస్తామని స్పష్టం చేశారు. గండ్ర వర్గం అభద్రతాభావంతోనే ఇలాంటి విమర్శలు చేస్తోందని ఆరోపించారు. భూపాలపల్లి అభివృద్ధికి బీఆర్ఎస్ ప్రభుత్వం గతంలో భారీగా నిధులు కేటాయించిందని, పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు.

*** అధిష్ఠానం జోక్యం చేసుకుంటుందా?**

భూపాలపల్లి బీఆర్ఎస్‌లో చోటుచేసుకుంటున్న తాజా పరిణామాలు పార్టీ శ్రేణుల్లో చర్చకు దారితీశాయి. ఇంతకాలం అంతర్గతంగా ఉన్న విభేదాలు ఇప్పుడు బహిరంగ విమర్శల స్థాయికి చేరుకోవడం పార్టీ నాయకత్వానికి ఇబ్బందికరంగా మారింది. ఒకవైపు నియోజకవర్గ ఇన్‌చార్జి విషయంలో పార్టీ అధిష్ఠానం నిర్ణయాన్ని గండ్ర వర్గం ప్రస్తావిస్తుండగా..మరోవైపు మధుసూదనాచారి వర్గం సీనియర్ నేతపై వ్యక్తిగత విమర్శలు చేయొద్దంటూ హెచ్చరిస్తోంది. దీంతో భూపాలపల్లి బీఆర్ఎస్‌లో నెలకొన్న విభేదాలకు పార్టీ అధిష్ఠానం ఎలాంటి పరిష్కారం చూపుతుందన్నది ఆసక్తికరంగా మారింది.

# ఆసుపత్రి, మెడికల్ కళాశాల ఖాళీల భర్తీకి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలి

*** ఆసుపత్రి నిర్వహణ, వైద్య సేవలపై సమీక్షించిన జిల్లా కలెక్టర్**



ప్రజాస్ఫూర్తి, ఖమ్మం జిల్లా : ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగి సంరక్షణ (పేషెంట్ కేర్)కు అత్యున్నత ప్రాధాన్యత ఇవ్వాలని, ఆసుపత్రి నిర్వహణలో సమస్యలు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారాలు రూపొందించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు. ఖమ్మం ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి సమావేశ మందిరంలో వైద్య అధికారులతో ఆసుపత్రి నిర్వహణ, ఎదురవుతున్న సమస్యలు, వైద్య సేవల నాణ్యత, పేషెంట్ కేర్ అంశాలపై జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ పారస్ కుమార్ లతో కలిసి సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఓపీ నిర్వహణకు అవసరమైన ప్రామాణిక విధానాలు (ఎస్ఓపీ) తప్పని సరిగా అమలు చేయాలని ఆదేశించారు. రోగుల అవసరాలకు అనుగుణంగా మందులు, ఇతర వైద్య సామగ్రిని నిరంతరం అందుబాటులో ఉంచాలని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న రోగులకు ఏ మందునూ ప్రైవేటుగా కొనుగోలు చేయాలని సూచించకూడదని స్పష్టం చేశారు.ఆసుపత్రిలో రోగి సంరక్షణకు అత్యున్నత ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రస్తుతం ఉన్న సమస్యలను మళ్లీ తలెత్తకుండా శాశ్వతంగా పరిష్కరించాలని సూచించారు. పార్కింగ్, సీసీ కెమెరాల ఏర్పాటు, ఇతర మౌలిక సదుపాయాల కల్పన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం అనుమతి ఇచ్చిన పోస్టులు భర్తీ కాకపోవడం మన వైఫల్యంగా పరిగణించాల్సి ఉంటుందని అన్నారు.వైద్యులు కేవలం వైద్య సేవలకే పరిమితం కాకుండా సమర్థవంతమైన పరిపాలకులుగా కూడా వ్యవహరించాలని, ఆసుపత్రి, మెడికల్ కళాశాలలో మొత్తం ఎన్ని ఖాళీలు ఉన్నాయో, వాటిలో ఎన్ని పోస్టులకు ఔట్‌సోర్సింగ్ ద్వారా భర్తీ చేసేందుకు అనుమతి లభించిందో, ఎన్ని పోస్టులకు అనుమతి లేదో, అనుమతి ఉన్నప్పటికీ ఎందుకు భర్తీ కాలేదో పూర్తి వివరాలతో నివేదిక సిద్ధం చేయాలని ఆదేశించారు. ఇదే నివేదికలో పారామెడికల్ సిబ్బంది ఖాళీల వివరాలను కూడా చేర్చి, అన్ని ఖాళీల భర్తీకి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక సమర్పించాలని సూచించారు.అనంతరం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఆసుపత్రిలోని ఓపీ విభాగం, వార్డులు, ఐసీయూ, మాతా శిశు ఆరోగ్య కేంద్రంలోని విభాగాలను పరిశీలించి రోగులకు అందుతున్న వైద్య సేవలను తనిఖీ చేసి అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సమావేశంలో ప్రధాన ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. నరేందర్, ప్రభుత్వ మెడికల్ కళాశాల పర్యవేక్షకులు డా. డా. రాజేశ్వర రావు, వైద్య శాఖ ఇఇ ఉమామహేశ్వర రావు, ఆసుపత్రి వివిధ విభాగాల వైద్యాధికారులు, వైద్యులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా శిశుగృహాన్ని సందర్శించిన డీఎల్ఎస్ఏ కార్యదర్శి పి. దేవి మానస



ప్రజాస్ఫూర్తి, ఖమ్మం జిల్లా : ఖమ్మం జిల్లా న్యాయ సేవా సంస్థ (డీఎల్ఎస్ఏ) కార్యదర్శి పి. దేవి మానస జిల్లా శిశుగృహాన్ని సందర్శించి అక్కడ పిల్లలకు అందిస్తున్న వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా పిల్లలతో ఆప్యాయంగా ముచ్చటించి వారి విద్య, ఆరోగ్యం, ఆహారం, నివాసం, పరిశుభ్రత, వైద్య సదుపాయాలు, భద్రత తదితర అంశాలపై ఆరా తీశారు. శిశుగృహ నిర్వాహకులతో మాట్లాడిన కార్యదర్శి, పిల్లల సమగ్ర వికాసానికి విద్యతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, పుస్తక పఠనం, చిత్రలేఖనం, సంగీతం వంటి వినోదాత్మక మరియు సృజనాత్మక కార్యక్రమాలను నిరంతరం నిర్వహించాలని సూచించారు. పిల్లల్లో ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు, సామాజిక నైపుణ్యాలు పెంపొందేలా అనుకూల వాతావరణాన్ని కల్పించాలని తెలిపారు. అదేవిధంగా ప్రతి చిన్నారికి ప్రేమాభిమానాలతో కూడిన సంరక్షణ అందించడంతో పాటు, వారి హక్కులను పరిరక్షిస్తూ బాలల సంక్షేమానికి సంబంధించిన అన్ని నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని అధికారులకు సూచించారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

*** ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు**

ప్రజాస్ఫూర్తి , కొత్తగూడెం : మొదటి విడత కింద ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేసి లబ్ధిదారులకు అందజేయాలని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అధికారులను ఆదేశించారు. మంగళవారం కొత్తగూడెంలోని క్యాంపు కార్యాలయంలో గృహ నిర్మాణ శాఖ, మున్సిపల్ కార్పొరేషన్, మండల ప్రజాపరిషత్ అధికారులతో ఇండ్ల నిర్మాణ పురోగతిపై ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో నిర్మాణాల్లో ఎదురవుతున్న సాంకేతిక సమస్యలను వెంటనే పరిష్కరించి, పనులు వేగవంతం అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఇండ్ల నిర్మాణాలను ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేయాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్క పేదవానికి సొంతింటి కల నెరవేరేలా యంత్రాంగం పారదర్శకంగా వ్యవహరించాలన్నారు. అదేవిధంగా రాబోయే రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల మంజూరుకు సంబంధించి ఎలాంటి లోటుపాట్లు లేకుండా ముందస్తుగానే పక్కా ప్రణాళికలతో సంసిద్ధంగా ఉండాలని అధికారులను కోరారు. ఈ సమీక్షా సమావేశంలో కార్పొరేషన్ కమిషనర్ సుజాత, చుంచుపల్లి ఎంపిడివో సుభాషిణి, లక్ష్మీదేవిపల్లి ఎంపిడివో సుస్మిత, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

# లిక్కర్ గుడుంబా స్థావరాలపై ఆకస్మిక దాడులు




మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాంలో భాగంగా మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డా"శభరిష్,ఐపీఎస్ ఆదేశాల మేరకు టౌన్ డీఎస్పీ తిరుపతి రావు సూచనల ప్రకారం మంగళవారం ఉదయం మహబూబాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సుందరయ్య నగర్ కాలనీలో టౌన్ ఇన్‌స్పెక్టర్ రఘుపతి రెడ్డి ఆధ్వర్యంలో పోలీసు సిబ్బందితో కలిసి కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు.ఈ సందర్భంగా అనుమతి లేకుండా బెల్ట్ షాప్ లో నిల్వ ఉంచిన లిక్కర్ ను అక్రమంగా నిల్వ ఉంచిన 10 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకుని,సుమారు 500 లీటర్ల బెల్లం పానకాన్ని గుర్తించి అక్కడికక్కడే ధ్వంసం చేశారు. అదేవిధంగా సరైన పత్రాలు, నంబర్ ప్లేట్లు లేని 10 వాహనాలను గుర్తించి తగిన చర్యలు చేపట్టారు.అనంతరం ఇన్స్పెక్టర్ కాలనీ వాసులతో మాట్లాడుతూ సైబర్ నేరాల నివారణ, ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తత,గంజా వల్ల కలిగే అనర్థాలు,గంజా రహిత సమాజ నిర్మాణంలో ప్రజల భాగస్వామ్యం,కాలని భద్రతలో సీసీ కెమెరాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు.గంజా, గుడుంబా లేదా ఇతర చట్టవ్యతిరేక కార్యకలాపాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు తెలియజేసి పోలీసులకు సహకరించాలని కోరారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలి

*** జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు**




ప్రజాస్ఫూర్తి ,మెదక్ జిల్లా: ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించడంతో పాటు పెండింగ్ కేసుల పరిష్కారాన్ని వేగవంతం చేసి బాధితులకు న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని మెదక్ జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు. మంగళవారం కౌడిపల్లి పోలీస్‌స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ నిర్వహణ, రికార్డులు, పెండింగ్ కేసులు, నేర నియంత్రణ చర్యలు, సిబ్బంది విధి నిర్వహణ, స్టేషన్ పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. రోడ్డు ప్రమాదాల నివారణకు చేపడుతున్న చర్యలను సమీక్షించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలను ప్రతిరోజూ నిర్వహించాలని ఆదేశించారు. ముఖ్యంగా 765D జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తూ.. అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం వంటి ఉల్లంఘనలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితులతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ. అనంతరం పోలీసు సిబ్బందితో సమావేశమై, విధి నిర్వహణలో క్రమశిక్షణ పాటిస్తూ శాంతిభద్రతల పరిరక్షణలో ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఈ తనిఖీలలో ఎస్పీ వెంట ఎస్బీ ఇన్‌స్పెక్టర్ సందీప్‌రెడ్డి, నర్సాపూర్ సీఐ రంగా కృష్ణ, ఎస్ఐ అమర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వ విద్యను నిర్లక్ష్యం చేస్తే పతనం తప్పదు

*** సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు భూక్య రమేష్**



ప్రజాస్ఫూర్తి , కొత్తగూడెం : సిపిఎం కొత్తగూడెం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం కూలీ లైన్ పాఠశాల యందు సిపిఎం బృందం సర్వే నిర్వహించారు .ముందుగా కూలీ లైన్ పాఠశాల ప్రాంగణాన్ని పరిశీలన , పాఠశాల విద్యార్థుల చదువుతున్న తీరుని, మౌలిక సదుపాయాలు కల్పన విషయంలో, ఉదయం అల్పాహారం, బోజనాలు వండుతున్న తీరు పై చర్చించడం జరిగింది. అనంతరం సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు భూక్య రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలను సందర్శించిన అనంతరం విద్యార్థులు ఎదుర్కొనే సమస్యలు తీవ్రంగా ఉన్నాయని ఆయన అన్నారు 100 మంది పైచిలుకున్న విద్యార్థులకు కూలీ లైన్ ప్రాథమిక పాఠశాలలో పర్మినెంట్ పోస్ట్ ఒకే ఒక్క టీచర్ మాత్రమే పాఠాలు బోధించడం ఏమిటని ఆయన ఆవేదన వ్యక్తం చేస్తూ , వర్షం వస్తే పాఠశాల ఆవరణం బురదమయంగా మారుతుందని ,క్లాస్ రూమ్స్ లేక క్లబ్ చేసి క్లాసులు నడిపిస్తున్నారని ,పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు . ఈ కార్యక్రమంలో సూరం ఐలయ్య , వైవి , గణేష్ , రాజు , షేక్ అల్తాన్ పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియలో రాజకీయ పార్టీల సహకారం అవసరం

*** ఆగస్టు 3లోగా పెండింగ్ ఓటర్ల మ్యాపింగ్ పూర్తి చేయాలి**

*** షాద్‌నగర్ తహసీల్దార్ నాగయ్య**

ప్రజాస్ఫూర్తి షాద్‌నగర్ :ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియలో భాగంగా పెండింగ్‌లో ఉన్న ఓటర్ల మ్యాపింగ్, డిజిటలైజేషన్ ప్రక్రియను పూర్తి చేసేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని షాద్‌నగర్ తహసీల్దార్ చెన్న నాగయ్య కోరారు. షాద్‌నగర్‌లో నిర్వహించిన రాజకీయ పార్టీల సమావేశంలో ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు. షాద్‌నగర్ రూరల్ పరిధిలో 2,294 మంది ఓటర్లకు సంబంధించిన ప్రక్రియ ప్రస్తుతం పెండింగ్‌లో ఉందని, ఆయా ఓటర్ల మ్యాపింగ్ పూర్తయ్యేలా రాజకీయ పార్టీల నాయకులు, బూత్ స్థాయి ప్రతినిధులు సహకరించాలని తహసీల్దార్ సూచించారు. ఈ ప్రక్రియను ఆగస్టు 3వ తేదీలోగా పూర్తి చేయాల్సి ఉందని తెలిపారు. ఈ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు. షాద్‌నగర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మొహమ్మద్ అలీ ఖాన్ బాబర్, బీఎస్పీ నాయకుడు దొడ్డి శ్రీనివాస్, బీఆర్ఎస్ నేత లక్ష్మణ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# స్త్రీ నిధి కమిటీ సమావేశాన్ని నిర్వహించిన అదనపు కలెక్టర్



ప్రజాస్ఫూర్తి, ఖమ్మం జిల్లా : మహిళా సంఘాల సభ్యులు ఆర్థికంగా అభివృద్ధి చెంది, తమ ఆదాయాన్ని పెంచుకునేలా సకాలంలో రుణాలను అందిస్తూ, నూరు శాతం రికవరీ సాధించేలా స్త్రీ నిధి, సెర్ప్, మెప్మా సిబ్బంది పూర్తి సమన్వయంతో పనిచేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన స్త్రీ నిధి కమిటీ సమీక్షా సమావేశంలో అదనపు కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, క్షేత్రస్థాయిలో సిబ్బంది మధ్య ఎలాంటి సమన్వయ లోపం లేకుండా పరస్పరం అందుబాటులో ఉంటూ మహిళా సంఘాలను బలోపేతం చేయాలని అన్నారు. రుణాల పంపిణీ, రికవరీ ప్రక్రియలో వెనుకబడిన సిబ్బంది పనితీరును అదనపు కలెక్టర్ సమీక్షించారు. క్షేత్రస్థాయి సమస్యలను అడిగి తెలుసుకుని, వాటిని త్వరితగతిన పరిష్కరించి నిర్దేశిత లక్ష్యాలను సాధించాలని ఆదేశించారు. వచ్చే నెల నాటికి రికవరీ శాతం ఖచ్చితంగా 60 శాతానికి చేరాలని, రాబోయే సమావేశంలో ప్రగతిని తానే స్వయంగా సమీక్షిస్తానని అన్నారు.స్త్రీ నిధి రుణ రికవరీ ప్రక్రియ మరింత పారదర్శకంగా, వేగంగా సాగడానికి మరియు నిధులు ఎక్కడా దుర్వినియోగం కాకుండా ఉండేందుకు రికవరీ మొత్తాన్ని పూర్తిగా 'మన స్త్రీ నిధి' యాప్ ద్వారానే సేకరించాలని ఆదేశించారు. యాప్‌పై ప్రతి ఎస్.హెచ్.జి మహిళకు పూర్తి అవగాహన కల్పించాలన్నారు. ఇందుకోసం పట్టణాలలో వార్డుల వారీగా, గ్రామాల్లో వీఓల వారీగా ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలన్నారు. ఈ సమీక్షా సమావేశంలో మెప్మా పీడీ, స్త్రీ నిధి రీజనల్ మేనేజర్ జి. రవీందర్ నాయక్, మెప్మా డీఎంసీ, ఏడీఎంసీ, టీఎంసీ, ఐదు టీఎల్ఎఫ్ మెప్మా సిబ్బంది, 20 మండలాల ఏపీఎంలు, స్త్రీ నిధి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# తక్కువ నీటితో సాగు చేసే పంటల వైపు జిల్లా రైతులు మొగ్గు చూపాలి

*** జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్**



ప్రజాస్ఫూర్తి, నల్లగొండ : నల్లగొండ మండలం ,కంచనపల్లి గ్రామంలో కంది పంటను సాగు చేసిన రైతుల వ్యవసాయ క్షేత్రాలకు మంగళవారం జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ వెళ్లి ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ఆరు తడి పంటలు సాగు చేస్తున్నందుకు రైతులను అభినందించారు. జిల్లా రైతులు వ్యవసాయ అధికారుల సూచనలను పాటిస్తూ స్థానిక పరిస్థితులకు అనుగుణంగా కంది, పెసర, మినుము, నువ్వులు, జొన్న, సజ్జ వంటి ఆరుతడి పంటలను సాగు చేసి నీటి వినియోగాన్ని తగ్గిస్తూ స్థిరమైన ఆదాయాన్ని పొందాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.ఈ వానాకాలంలో ఎల్‌నినో ప్రభావం కారణంగా తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్న దృష్ట్యా రైతులు తక్కువ నీటితో సాగు చేయగల ఆరుతడి పంటలను సాగు చేయాలని , వరి పంటకు బదులు ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలని జిల్లా కలెక్టరు తెలిపారు . ఈ మేరకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా రైతులకు అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించడం జరుగుతున్నదని అన్నారు.ఈ సందర్భంగా డ్రాగన్ ఫ్రూట్ రైతు అజేందర్ రెడ్డి, కంది రైతు దంపతులు అంజయ్య పార్వతమ్మ లను సన్మానించారు. జిల్లా వ్యవసాయ అధికారి వినోద్ కుమార్, ఉద్యాన శాఖ డిడి శేఖర్, తదితరులు జిల్లా కలెక్టర్ వెంట ఉన్నారు.

# యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలల నిర్మాణంలో వేగం పెంచాలి

*** జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ స్నేహ శబరిష్**

మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలల భవన నిర్మాణంలో వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టి అనుమతులు చేసి ప్రారంభించిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలల భవన నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు. జిల్లా కలెక్టర్,మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం,ఎర్రకుంట తండా,బొద్దిగొండ,కురవి మండలం, అయ్యగారిపల్లి గ్రామాలలో రెండు పాఠశాలలు మంజూరు కాగా ఒక్కో స్కూలుకు 200 కోట్ల చొప్పున 400 కోట్ల నిధులతో జిల్లాలో నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. అట్టి పనులను సంబంధిత అధికారులతో కలిసి



జిల్లా కలెక్టర్ మంగళవారం పరిశీలించారు. తెలంగాణ యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ అనేది తెలంగాణ ప్రభుత్వం ప్రారంభించిన ప్రతిష్ఠాత్మక విద్యా కార్యక్రమం.దీని ప్రధాన లక్ష్యం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అత్యున్నత ప్రమాణాల రెసిడెన్షియల్ విద్యను అందించడం.కోసం ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో బాలురకు ఒకటి, బాలికలకు ఒకటి చొప్పున యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేయాలనే లక్ష్యం. ప్రతి పాఠశాలలో 5వ తరగతి నుండి ఇంటర్మీడియట్ (12వ తరగతి) వరకు బోధన ఉంటుందని అన్నారు.ఒక్కో పాఠశాలలో సుమారు 2,560 మంది విద్యార్థులకు వసతి, విద్య అందించేలా రూపకల్పన ఆధునిక తరగతి గదులు,సైన్స్, కంప్యూటర్ ల్యాబ్స్,డిజిటల్ లెర్నింగ్,గ్రంథాలయం,క్రీడా మైదానాలు,హాస్టల్, భోజనశాల వంటి సదుపాయాలు ఉంటాయన్నారు.మొదటి దశలో బాలికల పాఠశాలలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందని, పేద,గ్రామీణ విద్యార్థులకు ప్రైవేట్ పాఠశాలల స్థాయి నాణ్యమైన విద్య అందించడం.పోటీ పరీక్షలు, ఉన్నత విద్య,ఉపాధికి అవసరమైన నైపుణ్యాలను అభివృద్ధి చేయడం.ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేయడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో ఈడబ్ల్యుసి ఇంజనీర్ అరుణ్ కుమార్, గూడూరు,కురవి తహసిల్దా రులు విజయ,కోమల,ఎంపీడీవో వీరబాబు,సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ లో మైనారిటీ లకు పెద్దపీట

ప్రజాస్ఫూర్తి, షాద్ నగర్ : షాద్ నగర్ నియోజకవర్గం లో మైనారిటీ లకు కాంగ్రెస్ పార్టీ పెద్దపీట వేస్తుందని షాద్ నగర్ బార్ అసోసియేషన్ సభ్యురాలు సబియా సుల్తానా, ఫెమినా మహిళా మండలి తరుపున అలియా సుల్తానా అధ్యర్యంలో మైనారిటీ నాయకులు షాద్ నగర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మొహమ్మద్ ఇబ్రహీం, షాద్ నగర్ మున్సిపాలిటీ కో ఆప్షన్ సభ్యులు ఖదీర్ ని ఘనంగా శాలువా పూలబొకే తో సన్మానించారు. కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచి మైనారిటీ లకు పెద్దపీట వేస్తుందని ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కృషి తో మైనారిటీ లకు గౌరవించి వారికీ సముచిత స్థానాలు కల్పించినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## సీజనల్ వ్యాధులను ఎదుర్కోవడంలో వైద్య బృందాలు ఎప్పటికప్పుడు చురుకుగా వ్యవహరించాలి

ప్రజాస్ఫూర్తి నల్లగొండ : సీజనల్ వ్యాధులను ఎదుర్కోవడంలో వైద్య బృందాలు ఎప్పటికప్పుడు చురుకుగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. ప్రత్యేకించి జ్వరం, మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ వంటివి వస్తే తక్షణ చికిత్స అందించేందుకు మలేరియా, ఫీవర్ బృందాలు చురుకుగా పని చేయాలని చెప్పారు . రానున్న 2,3 రోజులు రాష్ట్రంలో అక్కడక్కడ అధిక వర్షపాతం నమోదయ్యే ఆస్కారం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు రాష్ట్ర విపత్తు నిర్వహణ సెక్రెటరీ తో కలిసి హైదరాబాద్ నుండి అన్ని జిల్లాల కలెక్టర్లు సంబంధిత శాఖల అధికారులతో వాతావరణ పరిస్థితిలపై టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు.అనంతరం జిల్లా కలెక్టర్ జిల్లా అధికారులతో వాతావరణ పరిస్థితులను సమీక్షిస్తూ జిల్లాలో ఒకవేళ అధిక వర్షాలు నమోదైనట్లైతే ఎక్కడా రహదారి వ్యవస్థ దెబ్బతినకుండా ఆర్ అండ్ బి ,పంచాయతీరాజ్ అధికారులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని చెప్పారు. ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా చర్యలు తీసుకోవాలని వైద్యాధికారులను ఆదేశించారు. జ్వరం, టైఫాయిడ్, మలేరియా వంటి వ్యాధులకు తక్షణ చికిత్స అందించేందుకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఆసుపత్రుల్లో మందుల అందుబాటు, చికిత్సలకు అవసరమైన ఏర్పాట్లపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారితో సమీక్షించారు. మలేరియా ప్రాజెక్ట్ అధికారులు క్షేత్రస్థాయిలో తిరగాలని, ప్రత్యేకించి మున్సిపాలిటీలపై దృష్టి సారించి ప్రతి మంగళ, బుధ, గురువారాలు మున్సిపాలిటీలలో పర్యటించాలని ,శుక్ర, శనివారాలు గ్రామపంచాయతీలలో పర్యటించాలని ఆదేశించారు. ఎక్కడైనా మలేరియా, టైఫాయిడ్, డెంగీ వంటి వ్యాధులు సోకితే తక్షణమే చికిత్స ప్రారంభించాలని చెప్పారు. ఈ టెలికాన్ఫెరెన్స్ కు జిల్లా రెవిన్యూ అధికారి దశరథ్ ,రోడ్లు, భవనాల శాఖ ఎస్ ఈ పున్న మోహన్, ఆర్ అండ్ బి ఈ ఈ శ్రీధర్ రెడ్డి, డి ఎం హెచ్ ఓ డాక్టర్ రాహుల్ ,జిల్లా వ్యవసాయ అధికారి వినోద్ కుమార్, జిల్లా మలేరియా అధికారి, తదితరులు హాజరయ్యారు.

## వాతావరణం పరిస్థితులకు అనుగుణంగా వరి సాగుకు బదులుగా ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి

భువనగిరి ప్రజాస్ఫూర్తి : ఆలేరు మండలం కొలనుపాక గ్రామం లో క్లస్టర్ రైతు వేదిక లో మంగళవారం నిర్వహించిన ప్రత్యామ్నాయ పంటల పై అవగాహన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి పాల్గొని రైతులకు ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం గణనీయంగా తగ్గిన నేపథ్యంలో రైతులు ముందస్తు ప్రణాళికతో ప్రత్యామ్నాయ పంటలు సాగు చేపట్టాలని సూచించారు. నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని అధిక నీటి అవసరం ఉన్న వరి సాగుకు బదులుగా తక్కువ నీటితో సాగు చేయగలిగే, మార్కెట్ లో మంచి డిమాండ్ లాభదాయకత ఉన్నప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని రైతులకు సూచించారు త్రాగునీరు, సాగునీరు ప్రతి ఒక్కరికీ అత్యంత ముఖ్యమైన అంశాలని, అందుబాటులో ఉన్న నీటి వనరులను పొదుపుగా వినియోగించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. నీటి లభ్యతను బట్టి పంటల ఎంపిక చేసుకోవాలని, వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు తీసుకుని పంటల సాగు చేపట్టాలని రైతులకు సూచించారు. ప్రత్యామ్నాయ పంటల సాగుతో నీటి వినియోగాన్ని తగ్గించడంతో పాటు రైతులకు మెరుగైన ఆదాయం వచ్చేలా వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అవసరమైన సాంకేతిక సూచనలు, మార్కెట్ సమాచారంఅందించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. రైతు వేదిక లో ఏర్పాటు చేసిన విత్తన మేళాలను రైతులు పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రమణారెడ్డి , మున్సిపల్ కమిషనర్,తహసీల్దార్ వ్యవసాయ అధికారులు , సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## టీవీ అవార్డులు.. పేరు, లోగో తెలంగాణ ఆత్మను ప్రతిబింబించాలి

**: మంత్రి కోమటిరెడ్డి**



హైదరాబాద్: టీవీ అవార్డుల కమిటీతో తెలంగాణ సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సమావేశమయ్యారు. అవార్డుల లోగో, పేర్లు, కేటగిరీలపై కమిటీ సభ్యులతో మంత్రి చర్చించారు. పేరు, లోగో తెలంగాణ ఆత్మను ప్రతిబింబించేలా ఉండాలన్నారు. కమిటీ సభ్యులు సూచించిన మాజీ ప్రధాని పీవీ నరసింహారావు పేరుపై సీఎం రేవంత్‌తో చర్చిస్తామని చెప్పారు. అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమానికి రెండు, మూడు వేదికలు సూచించాలని.. సీఎంతో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామన్నారు. ''అవార్డుల ఎంపిక పూర్తి పారదర్శకంగా ఉండాలి. టీవీ రంగం ఎక్కువ ఎంటర్‌టైన్‌మెంట్ ఇస్తోంది. ఈ రంగంలో రాణిస్తున్న అన్ని కేటగిరీల వారిని ప్రోత్సహిస్తాం'' అని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు.

## జలసిరితో భవిష్యత్ తరాలకు నీటి భద్రత




మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : మహబూబాబాద్ మండలం, జంగిలిగొండ గ్రామపంచాయతీలో తెలంగాణ జలసిరి కార్యక్రమంపై గ్రామసభను గ్రామ సర్పంచ్ గుండెల రేణుక అధ్యక్షతన నిర్వహించారు.ఈ సందర్భంగా సర్పంచ్ గుండెల రేణుక మాట్లాడుతూ భవిష్యత్ తరాలకు నీటి భద్రత కల్పించడం,భూగర్భ జలమట్టాన్ని పెంపొందించడం,వర్షపు నీటిని సమర్థవంతంగా సంరక్షించడం,సుస్థిర జల నిర్వహణను సాధించడమే జలసిరి కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని అన్నారు. జల సంరక్షణ - మన సంరక్షణ అనే నినాదంతో ప్రతి గ్రామంలో నీటి భద్రతను కల్పించేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను రీఛార్జ్ చేసేందుకు ఇంకుడు గుంతలు ఎంతో అవసరమని తెలిపారు. వ్యవసాయ భూముల్లో వర్షపు నీటిని నిల్వ చేసేందుకు ప్రతి పొలానికి పంటగుంటలు,నీటిని నిల్వ చేసి భూగర్భ జలాలను పెంపొందించేందుకు ఊటకుంటలు ఏర్పాటు చేయడం ఎంతో ప్రయోజనకరమని వివరించారు.ప్రతి కుటుంబం, ప్రతి రైతు నీటి సంరక్షణలో భాగస్వాములై జలసిరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సర్పంచ్ గుండెల రేణుక కోరారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గుగులోతు రాములు,వార్డు సభ్యులు కొయ్యల కొమురెల్లి,ఇరుగు రమేష్, రత్నపురం సునీత, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు శాస్త్రీయ వ్యవసాయ విజ్ఞానాన్ని చేరవేయడంలో "రైతు నేస్తం" కార్యక్రమం కీలక పాత్ర

*** మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**



ప్రజాస్ఫూర్తి, ఖమ్మం జిల్లా : రైతులకు శాస్త్రీయ వ్యవసాయ విజ్ఞానాన్ని చేరవేయడంలో "రైతు నేస్తం" కార్యక్రమం కీలక పాత్ర పోషిస్తోందని వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.మంగళవారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ శాఖ, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక చొరవతో నిర్వహిస్తున్న 'రైతు నేస్తం' 100వ ఎపిసోడ్ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ రఘునాథపాలెం మండలంలోని రైతు వేదికలో పాల్గొని, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులకు అందించిన శాస్త్రీయ వ్యవసాయ సూచనలను వీక్షించారు. పంటల వైవిధ్యీకరణకు ప్రాధాన్యత ఇస్తూ ఉద్యాన పంటలు, ఆయిల్ పామ్ సాగును మరింత విస్తరించాలని పిలుపునిచ్చారు. ఆయిల్ పామ్ సాగు చేస్తున్న రైతులు మంచి ఆదాయం పొందుతున్నారని, ఆయిల్ పామ్ తోటల్లో జాజి, మిరియాలు, కోకో వంటి అంతర పంటలను సాగు చేసి అదనపు ఆదాయం పొందవచ్చని వివరించారు.ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, నీటి యాజమాన్యం, సమగ్ర పంట సంరక్షణ పద్ధతులను రైతులు అవలంబించాలని సూచించారు. భూగర్భ జలాల స్థితిని ప్రతిరోజూ రైతులకు తెలియజేసి, ఆ సమాచారాన్ని వ్యవసాయ ప్రణాళికలో వినియోగించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ, ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని రైతులు సంప్రదాయ పద్ధతులకు మాత్రమే పరిమితం కాకుండా శాస్త్రీయ విధానాలను అనుసరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, జిల్లా ఉద్యానవన శాఖ అధికారులు, మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తీరణ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## వినూత్న ఆలోచనలతో అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయాలి

**జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్**



ప్రజాస్ఫూర్తి, నల్లగొండ. : నల్గొండ మండల పరిషత్ కార్యాలయంలో వి బిజీ రాంజీ, జలసిరి పనులపై గ్రామ సర్పంచులు, గ్రామ కార్యదర్శులు, టెక్నికల్ సిబ్బందికి మంగళవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ చంద్రశేఖర హాజరయ్యారు. వి బి.జీ రాంజీ పనుల్లో భాగంగా గ్రామాల్లో ఇంకుడు గుంతలు, ఊట కుంటలు, నిర్మించి ప్రతి నీటి చుక్కను ఒడిసిపట్టేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అన్నారు. గ్రామాల్లో నీటి కొరత లేకుండా ఉండే విధంగా జల సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని ,ప్రతి గ్రామంలో ప్రజలతో చర్చించి గ్రామానికి అవసరమైన పనులను గుర్తించి వాటిపై అవగాహన కల్పించాలని తెలిపారు. రైతులు కేవలం పత్తి పంటపైనే ఆధారపడకుండా కందులు, పెసర్లు, సజ్జలు, కొర్రలు వంటి ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించేలా పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. గ్రామాలలో ఎక్కడపడితే అక్కడ చెత్త వేయకుండా చూడాలని, చెత్త వల్ల జ్వరాలు సోకే అవకాశం ఉందని, పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, ప్లాస్టిక్ ని సేకరించి అమ్మితే గ్రామానికి ఆదాయం వస్తుందని, గ్రామాలు అభివృద్ధి చెందాలంటే ఏం చేయాలో ఆలోచించాలని, ప్రజా ప్రతినిధుల సహకారంతోపాటు, మన వంతుగా గ్రామానికి ఏం చేస్తున్నామో ఆలోచించాలని, ఇందులో భాగంగా రైతులను కూడా ప్రోత్సహించాలని, ఫుడ్ ప్రాసెసింగ్ గోదాముల నిర్మాణం కోల్డ్ స్టోరేజ్ వంటి వాటి వల్ల ఆదాయం వచ్చే అవకాశం ఉందని, తద్వారా గ్రామాలు ముందుకు వెళ్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో డిపిఓ శంకర్ నాయక్ ,ఎంపీడీవో యాకూబ్ నాయక్, సర్పంచులు, కార్యదర్శులు టెక్నికల్ సిబ్బంది హాజరయ్యారు.

## మహిళతో అనుచిత సంబంధం.. జూబ్లీహిల్స్ సీఐపై సస్పెన్షన్ వేటు

హైదరాబాద్: జూబ్లీహిల్స్ సీఐ శ్రీనివాసులు రెడ్డిపై సస్పెన్షన్ వేటు పడింది. ఈ మేరకు ఆయనను సస్పెండ్ చేస్తూ హైదరాబాద్ పోలీస్ కమిషనర్ (సీపీ) సజ్జనార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఫిర్యాదు చేసేందుకు పోలీస్ స్టేషన్‌కు వచ్చిన మహిళతో అనుచిత సంబంధం పెట్టుకున్నట్లు విచారణలో నిర్ధరణ అయింది. మహిళ వీడియోలను చూపించి డబ్బులు వసూలు చేసినట్లు అధికారులు గుర్తించారు. కొన్ని రోజుల పాటు ఒకే ఇంట్లో కలిసి ఉన్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. అంతేకాకుండా మహిళను వదిలించుకునేందుకు పలు ప్రయత్నాలు చేసినట్లు సీఐపై ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో సీఐని సస్పెండ్ చేస్తూ సీపీ సజ్జనార్ ఆదేశాలిచ్చారు.

## అమెరికా పౌరులే లక్ష్యంగా మోసాలు.. వికాస్‌ను అరెస్ట్ చేసిన ఈడీ




హైదరాబాద్: అమెరికా పౌరులే లక్ష్యంగా మోసాలకు పాల్పడిన వ్యక్తిని ఈడీ అధికారులు అరెస్ట్ చేశారు. హైదరాబాద్ కేంద్రంగా వికాస్ కుమార్ నకిలీ కాల్ సెంటర్ ఏర్పాటు చేసి దాని ద్వారా .. అమెరికన్లకు ఫోన్ చేసి మోసాలకు పాల్పడినట్టు సమాచారం. మాదాపూర్‌లో 2023లో నమోదైన ఈ కేసుకు సంబంధించిన లావాదేవీలు, విదేశీ నిధుల బదిలీలపై ఈడీ విచారణ చేపట్టింది. అమెరికాలో పలువురిని బెదిరించిన వికాస్ ముఠా రూ.కోట్లలో వసూలు చేసి మనీలాండరింగ్‌కు పాల్పడినట్టు ఈడీ గుర్తించింది. ఈ క్రమంలో ఇవాళ ఉదయం హైదరాబాద్‌లో సోదాలు నిర్వహించిన ఈడీ అధికారులు వికాస్‌ను అరెస్టు చేశారు.

## మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌కు అడ్వాన్స్‌డ్ క్రిటికల్ కేర్‌లో చికిత్స

*** హెల్త్ బులెటిన్ విడుదల చేసిన యశోద ఆస్పత్రి వైద్యులు**



హైదరాబాద్: బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆరోగ్య పరిస్థితిపై యశోద ఆస్పత్రి వైద్యులు హెల్త్ బులెటిన్ విడుదల చేశారు. తీవ్రమైన పల్మనరీ ఎంబోలిజం కారణంగా రక్తప్రసరణ వ్యవస్థ కుప్పకూలి ఆయన షాక్‌కు గురైనట్లు వెల్లడించారు. ప్రస్తుతం అడ్వాన్స్‌డ్ క్రిటికల్ కేర్ యూనిట్‌లో చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. క్రిటికల్ కేర్, పల్మనరీ, కార్డియాక్, న్యూరాలజీ విభాగాలకు చెందిన వైద్యుల బృందం పర్యవేక్షణలో చికిత్స కొనసాగుతున్నట్లు పేర్కొన్నారు. మెకానికల్ వెంటిలేటర్‌పై చికిత్స కొనసాగుతున్నప్పటికీ, కనీస సపోర్ట్‌తో శ్వాస సంబంధిత పరిస్థితి, వైటల్స్ స్థిరంగా ఉన్నట్లు వైద్యులు వెల్లడించారు. ఆస్పత్రిలో చేరినప్పటి నుంచి న్యూరాలజికల్ స్పందన లేదన్నారు. మెదడుకు ఆక్సిజన్ అందకపోవడంతో జరిగిన నష్టాన్ని సూచించే లక్షణాలు ఈఈజీ, బ్రెయిన్ ఎంఆర్ఐ, టీసీడీ పరీక్షల్లో కనిపించినట్లు వైద్యులు తెలిపారు. న్యూరాలజికల్, భవిష్యత్ ఆరోగ్యస్థితిపై మరింత స్పష్టత కోసం బుధవారం మరోమారు పరీక్షలు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఆరోగ్య పరిస్థితిపై కుటుంబ సభ్యులకు ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తున్నట్లు యశోద వైద్యులు తెలిపారు.

## హైదరాబాద్‌ను ముంచెత్తిన భారీ వర్షం.. జలమయమైన రోడ్లు, స్తంభించిన ట్రాఫిక్

- **హైదరాబాద్‌ను ముంచెత్తిన భారీ వర్షం**
- **పలు ప్రాంతాల్లో రోడ్లు జలమయం, స్తంభించిన ట్రాఫిక్**
- **మియాపూర్, కూకట్‌పల్లి, రాయదుర్గంతో పాటు పలు ప్రాంతాల్లో వర్షం**

భాగ్యనగరాన్ని మంగళవారం సాయంత్రం భారీ వర్షం ముంచెత్తింది. హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాల్లో ఏకధాటిగా కురిసిన కుండపోత వానకు రహదారులన్నీ జలమయమయ్యాయి. దీంతో ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ ఎక్కడికక్కడ స్తంభించిపోవడంతో వాహనదారులు తీవ్ర అవస్థలు పడ్డారు. ముఖ్యంగా కార్యాలయాల పనివేళలు ముగిసే సమయం కావడంతో హైటెక్ సిటీ, మాదాపూర్, గచ్చిబౌలి తదితర ప్రాంతాల్లో కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. మియాపూర్, కూకట్‌పల్లి, రాయదుర్గం, మణికొండ, యూసుఫ్‌గూడ, ఖైరతాబాద్, కోఠి, మలక్‌పేట, దిల్‌సుఖ్‌నగర్ సహా నగరంలోని పలు ప్రాంతాల్లోపై వర్షం ప్రభావం తీవ్రంగా ఉంది. ఈ క్రమంలో హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజ్‌గిరి పోలీసులు రంగంలోకి దిగి కీలక జంక్షన్ల వద్ద ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. అదే సమయంలో హైడ్రా బృందాలు రహదారులపై నిలిచిన నీటిని తొలగించే పనులను వేగవంతం చేశాయి. కాగా, సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు కూడా నగరంలో పలుచోట్ల వర్షం కురిసింది.

హెల్త్

# వేడి నీళ్లతో ఎన్నో లాభాలు



**ప్రతిరోజూ వేడి నీళ్లు తాగితే ఆరోగ్యానికి చాలామంచిది అంటున్నారు ఎక్స్‌పర్ట్స్. ఇప్పటికే చాలామందికి ఈ అలవాటు ఉండే ఉంటుంది. ఒకవేళ అలవాటు లేకపోతే ఇప్పటి నుంచి అలవర్చుకోండి. ఎందుకంటే ఇలా రోజూ పరగడుపున వేడినీళ్లు తాగడం వల్ల బోలెడన్ని లాభాలున్నాయి.**

**జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది**
వేడి నీరు ఆహార కణాల విచ్ఛిన్నం చేసి జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. కడుపు కండరాలకు విశ్రాంతి, ఉపశమనాన్ని కలిగిస్తుంది. ఉబ్బరం, మలబద్ధకం వంటి సమస్యలను తగ్గిస్తుంది.

**గొంతు నొప్పిని తగ్గిస్తుంది**
వేడి నీళ్లలో తేనె, నిమ్మకాయ కలిపి తాగితే గొంతులో మంట, చికాకును తగ్గిస్తుంది. తద్వారా గొంతు నొప్పిని తగ్గిస్తుంది. గొంతును తేమగా ఉంచుతుంది.

**రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది**
వేడి నీరు రక్త నాళాలను విస్తరించడంలో సాయపడుతుంది. శరీరం అంతటా రక్త ప్రసరణను మెరుగుపరిచేలా చేస్తుంది. కణాలకు మెరుగైన ఆక్సిజన్, పోషకాలని అందిస్తుంది.

**బరువు తగ్గొచ్చు**
బరువు తగ్గించడంలో వేడి నీరు సాయపడుతుంది. శరీరంలో కొవ్వు నిల్వలను విచ్ఛిన్నం చేయడంలో సాయపడుతుంది.

**కండరాల నొప్పికి ఉపశమనం**
వేడి నీరు తాగితే.. కండరాలు రిలీఫ్ అవుతాయి. ఆర్థరైటిస్, కండరాల ఒత్తిడితో సంబంధం ఉన్న నొప్పిని తగ్గించడంలో సాయపడుతుంది. వాపును తగ్గిస్తుంది.అయితే... వేడి నీరు తాగేంత ఉష్ణోగ్రతలో ఉండాలి. విపరీతమైన వేడి నీరు తాగకూడదు. అలా ఉంటే నోరు, అన్నవాహికలలోని సున్నితమైన కణజాలాలకు నష్టాన్ని కలిగిస్తుంది.

## సరికొత్త ప్రయోగం..

# మీటీ రైస్!

ఆవిష్కరణ





**మనం తినే అన్నంలో కార్బోహైడ్రేట్లు ఎక్కువ, ప్రోటీన్లు తక్కువ. దీంతో డయాబెటీస్ లాంటి సమస్యలు ఉన్నవారు అన్నం తినడం మానేస్తున్నారు. ఒక్క పూట అన్నం తిని మిగతా రెండు పూటలా చపాతీలు, రొట్టెలు లాంటివి తీసుకుంటున్నారు. అయితే చాలా మందికి అన్నం తినకపోతే.. కడుపు నిండినట్టుగా ఉండదు. ఇలాంటి వారి కోసమే దక్షిణ కొరియా సైంటిస్టులు కొత్త రకం బియాన్ని అభివృద్ధి చేస్తున్నారు. ప్రోటీన్లను ఎక్కువగా అందించేలా 'మీటీ రైస్'ను కొరియన్ శాస్త్రవేత్తలు రూపొందిస్తున్నారు. గులాబీ రంగులో ఉండే ఈ మీటీ రైస్.. పేరుకు తగ్గట్టుగానే ఈ బియ్యంలోకి జంతువుల మాంసాన్ని జొప్పిస్తారు. అయితే ఇందుకోసం నిజమైన జంతువుల మాంసం కాకుండా.. ల్యాబ్‌ల్లో తయారు చేసిన బీఫ్ మాంసం, కొవ్వు కణజాలాలను వాడతారు.**

**ఎందుకు తయారుచేశారంటే...**
ఈ కల్చర్డ్ మీట్ ద్వారా శరీరానికి అవసరమైన ప్రోటీన్లను పొందొచ్చని సియోల్‌లోని యోన్సెయ్ యూనివర్సిటీకి చెందిన హంగ్ అనే పరిశోధకుడు తెలిపారు. ఆసియా దేశాల్లో ఎక్కువ మంది ఆహారంగా వరి అన్నం తింటారు. కాబట్టి ఆర్గనాయిడ్స్, బయోమెడికల్ సైన్సెస్‌లో నిపుణుడైన హంగ్.. తన పరిశోధన కోసం బియ్యాన్ని ఎంచుకున్నారు.ఈ మీటీ రైస్ తయారీ ప్రక్రియకు సాధారణ బియ్యాన్నే తీసుకొని.. దానికి చేపల నుంచి సేకరించిన గెలటిన్ (ప్రొటీన్) కోటింగ్ వేస్తారు. ఆ తర్వాత ఒక్కో గింజలోకి ల్యాబ్‌ల్లో తయారు చేసిన బీఫ్ కణాలను ఇంజెక్ట్ చేస్తారు. ఇలా బియ్యపు గింజల్లోకి మాంసపు కణాలను ఎక్కించిన తర్వాత అవి ఆ గింజల లోపల అంతటా సమంగా పెరుగుతాయి. సాధారణ బియ్యంతో పోలిస్తే ఈ పింక్ రైస్‌లో 8 శాతం ప్రొటీన్, ఏడు శాతం ఫ్యాట్ అదనంగా ఉంటాయి. ఈ బియ్యాన్ని ఎమర్జెన్సీ రిలీఫ్ ఫుడ్ కింద రెండు ఆఫ్రికా దేశాలకు అందించేందుకు అనుమతులు లభిస్తాయని కొరియా శాస్త్రవేత్తల బృందం ఆశిస్తోంది.

**పేద ప్రజల కోసం..**
కొన్ని దేశాల్లో ప్రజలు పేదరికం రోజుకు ఒక పూట మాత్రమే భోజనం చేయగలుగుతున్నారు. అలాంటి వారిలో ప్రొటీన్ కొంత శాతం పెరిగినా.. అది చాలా మంచిదేనని హంగ్ చెప్పారు. అయితే దక్షిణ కొరియా ప్రభుత్వం మాత్రం ఇంకా ఈ మీటీ రైస్ వాడకానికి ఆమోదం తెలుపలేదు. కానీ ఇలా కణ మార్పిడి చేసిన (మాంసం) ఆహారంపై పరిశోధనలకు ప్రాధాన్యం ఇవ్వాలని.. ఫుడ్‌టెక్ ఫండ్‌లో భారీగా పెట్టుబడులు పెట్టబోతున్నట్టు 2022లో కొరియా ప్రకటించింది.

**ఇటలీ బ్యాన్ చేసింది**
ఇప్పటికే సింగపూర్, అమెరికా మార్కెట్లలో కల్టివేటెడ్ మీట్ అందుబాటులో ఉంది. దీని ప్రభావం మాంసాన్ని ఉత్పత్తి చేసే జంతువులను పెంచే వారిపై ఉండే అవకాశం ఉంటుంది అనే భావనతో కల్టివేటెడ్ మీట్‌ను ఇటలీ గత ఏడాది నిషేధించింది.
కార్బన్ డయాక్సైడ్ తగ్గుతుంది!
ఈ హైబ్రిడ్ రైస్ పట్ల రకరకాల అనుమానాలు వ్యక్తం అవుతున్నప్పటికీ.. దీని వల్ల కార్బన్ డయాక్సైడ్ ఉత్పత్తి గణనీయంగా తగ్గుతుందని, జంతువులను వధించాల్సిన అవసరం ఉండదని హంగ్ బృందం చెప్తోంది. సంప్రదాయ పద్ధతిలో మాంసాన్ని ఉత్పత్తి చేసే దానికంటే.. ఈ విధానం వల్ల కార్బన్ డయాక్సైడ్ ఉత్పత్తి 8 రెట్లు తగ్గుతుందని హంగ్ తెలిపారు.

**2040 నాటికి...**
2040 నాటికి ప్రపంచవ్యాప్తంగా వినియోగించే మాంసంలో 40 శాతం మాత్రమే సంప్రదాయ విధానంలో ఉత్పత్తి అవుతుందని.. మిగతా 60 శాతం కల్చర్డ్ మీట్ ఉంటుందని ఏటీ కియర్నీ అనే గ్లోబల్ కన్సల్టెన్సీ అంచనా వేసింది. ఈ టెక్నాలజీతో పాలు, గుడ్డు తెల్లసొన, చేప మాంసాన్ని కూడా ఇలాంటి టెక్నాలజీతో రూపొందించొచ్చని 2019లోనే ఏటీ కియర్నీ తన నివేదికలో పేర్కొంది.
'మరి కొన్నేళ్లు పోతే.. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మన కిచెన్లలోకి కూడా వచ్చేస్తుంది. రక్త నమూనాను విశ్లేషించడం ద్వారా సదరు వ్యక్తికి బాగా నప్పే ఆహారాన్ని తయారు చేయాలని రోబోకు ఏఐ సూచనలు చేస్తుంది. ఇలా మన శరీర అవసరాలకు సరిపడే ఆహారాన్ని రోబో వండి మన ముందు ఉంచుతుంది' అని హంగ్ చెబుతున్నారు.



# యువతలో డయాబెటిస్!

మారుతున్న జీవనశైలి కారణంగా నేటి యువత అనారోగ్యం పాలవుతున్నారు. ముఖ్యంగా యువకుల్లో డయాబెటిస్ కేసులు రావడం ఆందోళన కలిగిస్తోంది. అసలు యువతలో డయాబెటిస్ రావడానికి కారణాలేంటి? పరిష్కార మార్గాలేంటో తెలుసుకుందాం.





**జీవనశైలి :**
శారీరక శ్రమ లేకపోవడం, స్క్రీన్ ఎక్కువ సమయం చూడడం వల్ల రావొచ్చు. కాబట్టి .. ఆరోగ్యకరమైన, చురుకైన జీవనశైలిని కలిగి ఉండాలి. క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి. ఒకేచోట కదలకుండా ఉండకూడదు. రోజూ వాకింగ్ చేయాలి.

**జంక్ ఫుడ్ :**
అధిక క్యాలరీలు, ప్రాసెస్ చేసిన ఆహారాలు తీసుకోవడం వల్ల మధుమేహం వచ్చే ప్రమాదం ఎక్కువ. అందుకే ఆహారపు అలవాట్లు, ఆహార ఎంపికల విషయంలో జాగ్రత్తగా ఉండాలి. తృణధాన్యాలు, లీన్ ప్రొటీన్లు, పండ్లు, కూరగాయలతో కూడిన పోషకమైన ఆహారాన్ని తీసుకోవాలి. అదే సమయంలో ప్రాసెస్ చేసిన ఆహారాలను పూర్తిగా తగ్గించాలి.

**ఊబకాయం :**
అధిక శరీర బరువు మధుమేహానికి దారితీస్తుంది. కాబట్టి బాడీ మాస్ ఇండెక్స్ (బీఎంఐ) ఎంత స్థాయిలో ఉందో తెలుసుకోవాలి. సమతుల్య ఆహారంతో పాటు క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి. హెల్దీ వెయిట్ ఉండేలా చూసుకోవాలి.

**జెనెటిక్స్ :**
మధుమేహం అనేది కుటుంబంలో ఎవరికైనా ఉంటే అది వారసత్వంగా వస్తోంది. దీన్ని ముందుగానే గుర్తించాలి. జన్యుపరమైన కారకాలను మార్చలేనప్పటికీ, ఆరోగ్యకరమైన జీవనశైలి ఇప్పటికీ మధుమేహం ప్రమాదాన్ని తగ్గించడంలో సాయపడుతుంది.

**తగినంత నిద్ర:**
తగినంత నిద్ర లేకపోవడం వల్ల మధుమేహం వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. అందుకే నిద్రకు అధిక ప్రాధాన్యత ఇవ్వండి.

**ఒత్తిడి :**
ఈ రోజుల్లో ఒత్తిడి చాలా ఎక్కువైపోతోంది. అయితే, దీర్ఘకాలిక ఒత్తిడి యువతలో మధుమేహం వచ్చే ప్రమాదాన్ని పెంచుతుంది. కాబట్టి సమతుల్య జీవనశైలిని కలిగి ఉండటంతో పాటు ఒత్తిడిని కంట్రోల్ చేసుకోవాలి.

**అధిక రక్తపోటు :**
హైపర్ టెన్షన్ అని పిలిచే అధిక రక్తపోటు వల్ల మధుమేహం వచ్చే ప్రమాదం ఎక్కువ. కాబట్టి ఆరోగ్యకరమైన జీవనశైలిని అనుసరించడం, రక్తపోటును కంట్రోల్ చేసుకోవడం వల్ల డయాబెటిస్ రాకుండా ఉంటుంది.





# సోషల్‌మీడియాలో ట్రోల్స్.. అల్లు అర్జున్ కీలక వ్యాఖ్యలు..

నచ్చని వాళ్ల గురించి ఆలోచించడం కంటే, నచ్చే పనిచేసుకుంటూ వెళ్లిపోవడం మంచిదని అభిమానులకు సూచించారు అల్లు అర్జున్. సామాజిక మాధ్యమాల వేదికగా ఒక హీరోపై మరో హీరో అభిమానులు విమర్శలు చేయడం, వారి లోపాలను ఎత్తి చూపడం ఇటీవల కాలంలో విపరీత ధోరణికి దారి తీస్తోంది. మరీ ముఖ్యంగా మార్ఫింగ్ ఫొటోలు, మీమ్స్‌తో ట్రోల్ చేయడం ఎక్కువైంది. ఈ నేపథ్యంలో మంగళవారం హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో అల్లు అర్జున్ తన అభిమానులను కలిశారు. వారితో కలిసి ఫొటోలు దిగారు. ఈ సందర్భంగా బన్నీ కీలక వ్యాఖ్యలు చేశారు. ''ఈరోజు నేను ఇక్కడ ఉండటం చాలా గర్వంగా ఉంది. ప్రతి ఒక్కరికీ పేరు పేరునా ధన్యవాదాలు. మీలో ఆ ఉత్సాహాన్ని ఎప్పటికీ పోనీయకండి. నా అభిమానులకే కాదు, నన్ను ద్వేషించే వారికీ ఈ విషయం చెప్పాలని ఎప్పటి నుంచో అనుకుంటున్నా. ఒకరిపై విమర్శలు చేయడం ఎప్పుడూ సరైనది కాదు. మనకు నచ్చని వాళ్ల కోసం మన డబ్బును ఖర్చు పెడతామా? లేదు కదా! అలాగే, మనకు నచ్చని వాళ్ల కోసం మన సమయం, డబ్బు, శక్తి ఎందుకు ఖర్చు చేయాలి? సోషల్‌మీడియాలో వచ్చే ట్రోల్‌పై స్పందించడం కంటే.. ఆ సమయాన్ని మీ సొంత ఎదుగుదల కోసం ఉపయోగించుకోండి. మీకు నచ్చిన పని చేయండి. నీకు నచ్చిన అమ్మాయి ఇంటి ముందు కూర్చోండి. పర్లేదు కనీసం నువ్వు ఆ సమయాన్ని అయినా ఆస్వాదిస్తారు కదా. ఎవరినీ ఎప్పుడూ ట్రోల్స్ చేయకండి. టైమ్, ఎనర్జీ ఏదైనా అనుకోండి. ప్రతి మనిషికి ఒక రోజులో 100శాతం ఉందనుకుంటే, దాన్ని మీరు దేనికి వాడతారనేది ముఖ్యం'' అని అల్లు అర్జున్ అభిమానులకు సూచించారు. బన్ని చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల వేదికగా వైరల్ అవుతున్నాయి.



## ఆ రూమర్సన్నీ ఒట్టియే

గత కొద్ది రోజులుగా మూవీస్ కంటే ప్రేమ పుకార్లతోనే ఎక్కువగా వార్తల్లో ఉంటోంది మృణాల్ ఠాకూర్. ఇటీవలే కోలీవుడ్ హీరో ధనుష్‌తో ప్రేమలో ఉందంటూ రూమర్స్ రావడంతో అవన్నీ పుకార్లేనని ఫుల్‌స్టాప్ పెట్టేసింది. తాజాగా ముంబైలోని ఓ కేఫ్‌లో క్రికెటర్ యశస్వి జైస్వాల్ కనిపించడంతో వీరి మధ్య లవ్ రూమర్లు జోరందుకున్నాయి. ఈ డేటింగ్ రూమర్లపై ఈ అందగత్తె టీమ్ క్లారిటీ ఇచ్చింది. అవన్నీ అబద్ధాలే. జైస్వాల్‌తో ఆమెకు అసలు పరిచయమే లేదు. వారు వేర్వేరుగా ఆ కేఫ్‌లోకి వెళ్లారు. ఎవరో ఎడిట్ చేసి ఒకే టైమ్‌కు ఇద్దరు బయటకు వచ్చినట్లు ఫేక్ వీడియోను పోస్ట్ చేశారు అని మృణాల్ టీమ్ పేర్కొన్నది.

## ప్చ్.. బాలీవుడ్ అచ్చొస్తలే

అందాల చందమామ కాజల్ అగర్వాల్‌కు బాలీవుడ్ అచ్చిరావడం లేదు. ది ఇండియా స్టోరీతో ఆమె ఖాతాలో మరో డిజాస్టర్ చేరింది. దాదాపు 30 కోట్ల బడ్జెట్‌తో రూపొందిన ఈ మూవీ ఐదు రోజుల్లో కేవలం 92 లక్షల కలెక్షన్స్ మాత్రమే రాబట్టింది. మొదటి రోజు కేవలం 16 లక్షలు, ఐదో రోజు కేవలం తొమ్మిది లక్షల వసూళ్లను మాత్రమే రాబట్టింది. హిందీ వెర్షన్ కోసం కాజల్ ప్రమోషన్స్ చేసినా అనుకున్నంత బజ్ రాలేదు. పురుగుమందుల వాడకం వల్ల తలెత్తుతోన్న అనర్థాలపై ఈ సినిమా తెరకెక్కింది.





## ఈసారి డేరింగ్ గర్ల్ గా..

పర్సనల్ లైఫ్‌ను ఎంజాయ్ చేస్తూనే మరోవైపు కెరీర్‌పై ఫోకస్ పెడుతోంది త్రిష. ప్రస్తుతం ఓ వెబ్‌సిరీస్‌తో త్వరలోనే తెలుగు ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఆమె లీడ్ రోల్‌లో నటించిన బృందా వెబ్‌సిరీస్‌కు సీజన్ 2 రాబోతుంది. ఈ సిరీస్ ఆగస్ట్‌లో సోనీ లివ్ ఓటీటీలో రిలీజ్ కానున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఫస్ట్ సీజన్‌లో అమాయకత్వం, ధైర్యం కలబోసిన పోలీస్‌గా కనిపించగా సెకండ్ సీజన్‌లో డేరింగ్ అండ్ డాషింగ్‌గా ఆమె పాత్ర సాగుతుందని అంటున్నారు. ఈ వెబ్‌సిరీస్‌కు మనోజ్ వంగల దర్శకత్వం వహిస్తున్నారు. త్వరలోనే బృందా 2 రిలీజ్ డేట్‌పై అఫీషియల్ అనౌన్స్‌మెంట్ రానున్నట్లు చెబుతున్నారు. కాగా ప్రస్తుతం తెలుగులో చిరంజీవి విశ్వంభరలో హీరోయిన్‌గా నటిస్తోంది త్రిష.

## ఎన్టీఆర్‌కు గాయం.. షూటింగ్‌కు బ్రేక్



టాలీవుడ్ స్టార్ హీరోలు వరుస ప్రమాదాల బారిన పడటం అభిమానులను కలవరపాటుకు గురిచేస్తోంది. ఇటీవల రాం చరణ్, బాలకృష్ణ గాయాలబారిన పడగా తాజాగా డ్రాగన్ షూటింగ్‌లో ఎన్టీఆర్ గాయపడ్డారు. ఆయన భుజానికి తీవ్ర గాయం కావడంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు హాస్పిటల్‌లో ఆయనకు చికిత్స చేశారు. గాయం నుంచి కోలుకోవడానికి ఆరు నుంచి ఎనిమిది వారాల టైమ్ పడుతుందని వైద్యులు తెలిపారు. అప్పటివరకు షూటింగ్‌కు బ్రేక్ పడనున్నట్లు సమాచారం. కాగా ఎన్టీఆర్ గాయంపై ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన టీమ్ ప్రకటించింది.

## మామ్ సీక్వెల్స్ లో చిన్నకూతురు హీరోయిన్



దివగంత నటి, అతిలోక సుందరి శ్రీదేవి కెరీర్‌లో చివరి మూవీగా మామ్ ప్రేక్షకుల ముందుకొచ్చింది. రివేంజ్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన ఈ మూవీకి దాదాపు తొమ్మిదేళ్ల తర్వాత సీక్వెల్ రాబోతుంది. మామ్ 2 పేరుతో తెరకెక్కుతోన్న ఈ సినిమాలో శ్రీదేవి చిన్న కూతురు ఖుషీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తోంది. మామ్ కథకు కొనసాగింపుగానే ఈ మూవీ ఉండబోతున్నట్లు సమాచారం. ఇందులో శ్రీదేవికి సంబంధించిన పాత్ర ప్రస్తావన కనిపిస్తుందట. నవంబర్‌లో రిలీజ్ చేసేందుకు నిర్మాత బోనీ కపూర్ సన్నాహాలు చేస్తున్నట్లు తెలిసింది.

## సీనియర్ నటి పావలా శ్యామల కన్నుమూత

ప్రముఖ సీనియర్ నటి పావలా శ్యామల కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆమె ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున తుదిశ్వాస విడించారు. తీవ్రమైన గుండెపోటు రావడంతో మరణించినట్లు ఉస్మానియా డాక్టర్లు అధికారికంగా ప్రకటించారు. వనస్థలిపురంలో సామాజిక కార్యకర్త శంకర్ నిర్వహిస్తున్న 'రెడీ టూ సర్వ్ ఫౌండేషన్' (వృద్ధాశ్రమం)కు శ్యామల పార్థివదేహాన్ని తరలించారు. బుధవారం 11 గంటలకు ఫిల్మ్ నగర్ మహాప్రస్థానంలో అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

**స్వర్ణకమలంతో గుర్తింపు..**

1951లో అమరావతిలో పావలా శ్యామల జన్మించింది. ఈమె అసలు పేరు నేతి శ్యామల. గణేష్ పాత్రో రచించిన 'పావలా' నాటకంలో ఆమె చేసిన అద్భుతమైన నటన వల్ల 'పావలా శ్యామల'గా గుర్తింపు పొందారు. 1985లో 'బాబాయ్ అబ్బాయ్'తో ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చి కె. విశ్వనాథ్ దర్శకత్వంలో 'స్వర్ణకమలం' సినిమాతో గుర్తింపు పొందారు. కృష్ణవంశీ దర్శకత్వంలో వచ్చిన 'ఖడ్గం'లో సహాయ నటి పాత్రలో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు.



Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.